ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 11 జూలై 2025



పొదలకూరులో తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో

ఉత్సాహంగా మెగా పీటీఎం 2.0

సంబరం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చడంతో విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి తల్లిదండ్రులతో విద్యా పరమైన అంశాలను చర్చించడంతో పాటు ఆటపాటలు, సహపంక్తి భోజనాలు చేసి పిల్లల ప్రగతి నివేదికలు అందచేశారు. గురువారం జిల్లాలోని 4,422 పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ 2.0 కార్యక్రమాలు విజయవతంగా ముగిశాయి. విద్యార్థులందరికీ తల్లిపేరుతో మొక్కలను పంపిణీ చేశారు.

● కళాశాలల్లో సమావేశాలు ఏవీ!?

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోనూ మెగా పీటీఎం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినా కళాశాలల్లో ఎక్కడా ఈ కార్యక్రమాలు నిర్వహించలేదు. నగరంలోని డీకే జూనియర్ కళాశాల, కేఏసీ, జీవీఆర్ఆర్ కళాశాలల్లో మాత్రం సమావేశాలు నిర్వహించారు. వీటిలో కూడా ఇంటర్ బోర్డు అధికారులెవరూ పాల్గొనకపోవడం విశేషం. ప్రైవేట్ కళాశాలల్లో అయితే ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామన్న సమాచారం కూడా తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఇవ్వలేదని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు : వైవీఎం స్కూలులో లెమన్ స్పూన్ పోటీలో తల్లులు



ఉదయగిరిలో తల్లిపేరుతో మొక్క అందుకుంటూ..



నెల్లూరు : బాలాజీనగర్ సాయిదర్బార్‌లో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

శ్రీగురుభ్యో నమః

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. శైవ ఆలయాల్లో గురుదక్షిణామూర్తికి, వైష్ణవ ఆలయాల్లో హయగ్రీవునికి, వ్యాస మహర్షికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. షిరిడీ సాయిబాబా మందిరాల్లో విశేష పూజలు, భారీ స్థాయిలో అన్నదానం జరిగాయి. భక్తులతో సాయి మందిరాలు కిటకిటలాడాయి. నాలుగు పూటల షిరిడీ హారతులు, సాయి సచ్చరిత్ర పారాయణం జరిగాయి. కొన్ని వైష్ణవ ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. పలు పాఠశాలల్లో గురువులను పూజించారు.

నేటి నుంచి

రెవెన్యూ క్రీడలు

నెల్లూరు (హరనాథపురం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) రెవెన్యూ క్రీడల నిర్వహణకు రెవెన్యూ యంత్రాంగం, ఏపీఆర్ఎస్ఏ సిద్ధమయ్యాయి. శుక్రవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు ఈ క్రీడలు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగనున్నాయి. పోటీలను జిల్లా జడ్జి జీ శ్రీనివాస్ ప్రారంభిస్తారు. కలెక్టర్ ఆనంద్ పాల్గొంటారు. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడం, ఉద్యోగుల మధ్య స్నేహభావనకు ఈ క్రీడలు దోహదపడతాయి. క్రికెట్, క్యారమ్స్, చెస్, లెమన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, జావెలిన్ త్రో తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. నగరంలోని ఏపీఆర్ఎస్ఏ కార్యాలయానికి చేరిన క్రీడా దుస్తులను డివిజన్ల వారీగా ఉద్యోగులు, అధికారులకు పంపిణీ చేశారు.

ఖరీఫ్ పంటలకు బీమా

నెల్లూరు(వ్యవసాయం), జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారంగా వరి, వేరుశనగ పంటలను నోటిఫై చేసినట్లు పేర్కొన్నారు. ఎకరా వరి పంటకు రూ.840, వేరుశనగ పంటకు రూ.700 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వరికి ఆగస్టు 15, వేరుశనగ పంటకు జూలై 31వతేదీ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద పత్తి, నిమ్మ పంటలను నోటిఫై చేసినట్లు పేర్కొన్నారు. పత్తికి రూ.2వేలు, నిమ్మకు రూ.2400 ప్రీమియం చెల్లింపునకు ఈ నెల 17వతేదీ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, దిగుబడి తగ్గిన సమయాల్లో ఈ బీమా పథకాలు రైతులకు ఉపయోగపడతాయని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత ప్రయాణం

సాఫీగా సాగేలా...

బస్సుల కండీషన్స్‌పై ఉన్నతాధికారుల దృష్టి

సర్వీసులు బ్రేక్‌డౌన్ కాకూడదని స్పష్టత

డిపోల వారీగా అవసరాల గుర్తింపు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఆగస్టు 15 నుంచి ప్రారంభించనుంది. ఈ క్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు జిల్లాల వారీగా ప్రాంతీయ రవాణాధికారులతో సమీక్షించారు. రీజియన్‌లో బస్సుల సంఖ్య, షెడ్యుల్స్, ఓఆర్, బస్సుల కండీషన్స్, ఓఆర్ పెరిగితే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏం చేయాలి? స్పేర్ పార్ట్సు అన్ని ఉన్నాయా.. ఇంకా ఏం కావాలి? ఇలా పలు అంశాలపై చర్చించారు. నెల్లూరు ఆర్ఎం షేక్ షమీమ్ జిల్లాకు కావాల్సిన అవసరాలను రాష్ట్ర అధికారులకు తెలిపారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం!

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన మంగళగిరిలో జరిగిన ఆర్టీసీ బోర్డు మీటింగ్ పలు అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు వసతుల కల్పనకు త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. అందుకు సంబంధించి రద్దీ ప్రాంతాల్లో అద్దె బస్సులను తీసుకునేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

● డిపోల వారీగా అవసరాలు

జిల్లాలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాక బస్సులు బ్రేక్‌డౌన్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంను ఆదేశించారు. రీజియన్‌లో ఎన్ని డిపోలు ఉన్నాయి.. ఏ డిపోలో ఎన్ని బస్సులు ఉన్నాయి... వంద శాతం ఓఆర్ వస్తే బస్సులు నడిచే పరిస్థితులు ఉన్నాయా, డిపోలోని గ్యారేజ్‌లలో మీకు బస్సుల రిపేర్లకు కావాల్సిన వస్తువులు, మరేమైనా అవసరాలు తెలపండి అంటూ ఆర్ఎంను కోరారు. దీంతో ఆర్ఎం డిపోల వారీగా ఉన్నవాటి వివరాలు, అవసరాలను ఉన్నతాధికారులకు తెలియజేశారు.

● స్పేర్‌పార్టులు పంపండి

రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో పలు స్పేర్‌పార్టులు కావాలని అధికారులకు విన్నవించుకున్నారు. కందుకూరు డిపోలో బీఎస్-6 టూల్స్ కావాలని, ఎలక్ట్రికల్ కేబుల్స్ రీప్లేస్‌డ్ చేయాలని, టవర్ లైట్స్ కావాలని, ఆయిల్ బంకు, వాషింగ్ ప్లాంట్ ఏరియాల్లో సెక్యూరిటీ గార్డులు కావాలని కోరారు. కావలి డిపో పరిధిలో స్ప్రింగ్ యు క్లాంప్ బిట్స్, పైప్ రించ్‌లు కావాలని, నెల్లూరు-1వ డిపో పరిధిలో స్ప్రింగ్ క్యాంబరింగ్ మిషన్ ఉంచేందు రూమ్, నైట్ పెట్రోలింగ్ సెక్యూరిటీ పర్సన్, అడిషనల్ సూపర్‌వైజర్ కావాలని, నెల్లూరు-2వ డిపో పరిధిలో స్ప్రింగ్ క్యాంబెరింగ్ మిషన్ కావాలని, గ్యారేజ్‌లో కొందరు సిబ్బంది కావాలని కోరారు. రాపూరు డిపో పరిధిలో టామి రోడ్స్ ఈ15 స్పేర్స్ కావాలని, గ్యారేజ్‌లో లైటింగ్‌కు సంబంధించి, ఇతర అవసరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



చివరి రోజు కూడా భక్తులతో రద్దీగా ఉన్న స్వర్ణాల చెరువు ఘాట్



ఇక సెలవ్..

మళ్లీ వస్తాం!

● నెల్లూరులో ముగిసిన రొట్టెల పండుగ ● ఐదు రోజుల్లో 11 లక్షల మందికిపైగా భక్తుల రాక

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగ గురువారం రాత్రి ముగిసింది. ఈ నెల 10వ తేదీన పండుగ ప్రారంభమవగా ఐదు రోజులపాటు 11 లక్షల మందికిపైగా భక్తులు హాజరైనట్లు అధికారుల అంచనా. ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు హరియానా, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళా, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తజనం తరలివచ్చి, వరాల రొట్టెలను అందుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం, కార్పొరేషన్ సిబ్బంది విస్తృత సేవలు అందించారు. కాగా, గురువారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబంతో కలిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని కోరుతూ సంక్షేమం రొట్టెను పట్టుకున్నారు.

● అందరి సహకారంతోనే..

అందరి సహకారంతోనే రొట్టెల పండుగ విజయవంతమైందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం సాయంత్రం దర్గా ఆవరణలోని ఏపీ టూరిజం పార్కులో వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో రొట్టెల పండుగత ముగింపు సభలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి అజీజ్ పాల్గొని మాట్లాడారు. దర్గాలో మసీదు, ఈద్గా నిర్మాణాలకు టెండర్లు త్వరలోనే పిలవనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దర్గా అభివృద్ధికి మరింత కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, ఆర్డీవో అనూష, డీఎస్పీ సింధుప్రియ, మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

● పటిష్ట బందోబస్తు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రొట్టెల పండుగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు అధికారులు 1700 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. రద్దీలో తప్పిపోయిన 200 మంది చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించారు. ఐదుగురు జేబుదొంగలను అదుపులోకి తీసుకుని వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. బందోబస్తు విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య అభినందించారు.

యూరియా...

ఏదయ్యా!

● దూరప్రాంతాలకు వెళుతున్న రైతులు

● రెట్టింపు ధర చెల్లించి కొనుగోళ్లు

● చోద్యం చూస్తున్న వ్యవసాయ అధికారులు

ఉదయగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్‌లో పంటల సాగు జోరందుకుంది. ఈ సమయంలో యూరియా దొరక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల్లో యూరియా దొరకడం లేదు. దీంతో కొంతమంది రైతులు దూరప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఇదే అవకాశంగా భావించి కొంతమంది వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు.

● కాంప్లెక్సు ఎరువులు కొంటేనే...

ఎరువుల కంపెనీలవారు కాంప్లెక్సు ఎరువులు కొంటేనే యూరియా విక్రయిస్తామని చెబుతుండడంతో డీలర్లు వెనుకంజ వేస్తున్నారు. రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కొంతమంది డీలర్లు యూరియాతోపాటు కాంప్లెక్సు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. అయితే కొంతమంది డీలర్లు రైతులకు కూడా ఇదే షరతు పెట్టడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 45 కిలోల యూరియా బస్తా మార్కెట్ ధర రూ.1,457.29లు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.1,190.79 రాయితీ ఇవ్వడంతో రూ.266.50లకు విక్రయిస్తున్నారు. కానీ కొంతమంది అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అక్కడ బస్తా రూ.420 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అయినా వ్యవసాయ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా యూరియాను అందుబాటులోకి తీసుకు రావాలని రైతులు కోరుతున్నారు.

కలిగిరిలో 'బ్లాక్'!

కలిగిరి : ప్రభుత్వ దుకాణాల్లో యూరియా కొరత ఏర్పడింది. దీంతో ప్రైవేటు దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తుండటంతో అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కలిగిరి మండలంలో వరి 25.49 హెక్టార్లు, వేరుశనగ 120.59 హెక్టార్లు, నువ్వులు 46.53 హెక్టార్లు, మొక్కజొన్న 68.79హెక్టార్లు, మినుము 19 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పైరు సాగుచేయాలంటే సేంద్రియ ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రసాయనిక ఎరువులే దిక్కుగా మారాయి. మండలంలోని కలిగిరి, కుడుములదిన్నెపాడు, సిద్దనకొండూరులలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నా అవసరం మేరకు యూరియా అందుబాటులో లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గరిష్ఠ ధర రూ.266 ఉండగా ప్రైవేటు దుకాణాల్లో రూ.390 నుంచి 420 వరకు విక్రయిస్తున్నారు. కొనుగోలు రశీదు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవనే విమర్శలు ఉన్నాయి.



కలిగిరి : యూరియా బస్తాలను ఆటోలో తీసుకెళుతున్న రైతు



ఉదయగిరి ప్రాంతంలో పసుపు విత్తుతున్న కూలీలు (ఫైల్)

అధిక ధరకు కొనుగోలు చేస్తున్నాం

స్థానికంగా యూరియా అందుబాటులో లేకపోవడంతో వేరే మండలానికి వెళ్లి బస్తా రూ.420ల చొప్పున కొనుగోలు చేస్తున్నాం. ఇటీవల వర్షం కురిసింది. ప్రస్తుతం పంటలకు యూరియా వేయాల్సి ఉంది. ఈ తరుణంలో యూరియా ఎంతో అవసరం.

- దేవసాని చెంచురామిరెడ్డి, కృష్ణారెడ్డిపల్లి

ఎన్నడూ ఈ పరిస్థితి లేదు

యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడడం ఎన్నడూ చూడలేదు. ప్రస్తుతం పంటల సాగు జోరందుకోవడంతో యూరియా అవసరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి.

- కొండా రమణారెడ్డి, రైతు, బిజ్జంపల్లి

అధిక ధరలు భారంగా ఉన్నాయి

10 ఎకరాల్లో వరి పండిస్తున్నాను. ప్రభుత్వ దుకాణాల్లో ఎరువులు అందుబాటులో లేవు. దీంతో ప్రైవేటు దుకాణాల వద్ద అధిక ధరలు పెట్టి ఎరువులు కొనాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడులు అధికమవుతున్నాయి. అధికారులు స్పందించి యూరియా కొరత తీర్చాలి.

- తిరుణమల్లి గోపి, అగ్రహారం

యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదు. ఇటీవల జిల్లాకు 2,600 టన్నుల క్రిబ్‌కో యూరియా వచ్చింది. ప్రస్తుతం వెయ్యి టన్నుల యూరియా అందుబాటులో ఉంది. అక్కడి అధికారులతో చర్చించి రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాలకు సరఫరా చేస్తాం.

- పవన్, మార్క్‌ఫెడ్ డీఎం

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి వెబ్ ఆప్షన్

పొదలకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్, గుర్తింపు పొందిన ప్రైవేటు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల డిప్లమో కోర్సుల్లో (2025-26 విద్యా సంవత్సరం) ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కాలేజీ ఎంపిక కోసం వెబ్ ఆప్షన్ సౌకర్యం ఈనెల 12 వరకు కల్పించినట్లు పొదలకూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ప్రసన్న రాజేష్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9312
వెండి కిలో ధర	రూ. 110300
వెండి ఒక గ్రాము	రూ. 113.30

వైభవంగా గురు పౌర్ణమి

బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● భక్తులతో కిక్కిరిసిన మందిరాలు ● ఊరూరా అన్నదానాలు

ముత్తుకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురు పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. వల్లూరులోని శ్రీ శివసాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగడా హారతితో ప్రారంభమైన వేడుకలు రాత్రి సేజ్ హారతితో ముగిశాయి. ఉదయం పంచామృతాభిషేకాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త వల్లూరు మోహన్‌రావు, హైమావతి దంపతులు విశేష పూలంగిసేవ, హోమాలు చేశారు. మధ్యాహ్నం విష్ణు సహస్ర సహిత శ్రీసాయి అష్టోత్తర శతనామాల పూజలు జరిగాయి. వల్లూరు శిరీష రాణి సహకారంతో విశేష పూల అలంకరణ చేశారు. అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాయిబాబా పల్లకిసేవను వైభవంగా జరిపారు. తాళ్లపూడి సాయిబాబా మందిరం, పిడతాపోలూరు కూడలిలోని సాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా భక్తులకు అన్నదానం చేశారు.

● **వెంకటాచలం :** మండలంలోని సర్వేపల్లిలో పునర్నిర్మాణంలో ఉన్న గంగమ్మ దేవస్థానాన్ని గురువారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సందర్శించారు. దేవస్థానం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ ద్వారా దేవస్థానానికి నిధులు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సాయిబాబా గుడిని ఎమ్మెల్యే సోమిరెడ్డితోపాటు సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి సందర్శించారు. ఇస్కపాళెం టీడీపీ నేత కిషోర్‌రెడ్డి, ఆయన కుమారై శ్రీనితారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కిషోర్‌రెడ్డి, శ్రీనితారెడ్డి, తెనాలి రమణయ్య, బద్వేలు చెన్నకృష్ణయ్య, గంగమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు సురేంద్రయాదవ్, సుమన్, పవన్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** నగర పంచాయతీతోపాటు మండలవ్యాప్తంగా బాబా, వెంకయ్య స్వామి మందిరాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. జొన్నవాడ తిప్పమీద ఉన్న శ్రీ దత్తత్రేయ మఠం, శ్రీశివానందస్వామి వారిని స్థానిక, కర్నూలుకు చెందిన భక్తులు పూలమాలలతో గురుపూజ, పాదపూజ చేసి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

● **మనుబోలు :** మండలంలోని మనుబోలు, బద్దెవోలు, జట్లకొండూరు, మడమనూరు గ్రామాల్లో ఉన్న బాబామందిరాలు గురువారం భక్తులతో కిక్కిరిశాయి. బాబావిగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం పల్లకిసేవలు నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. జట్లకొండూరులోని బాబా మందిరంలో ఎస్‌ఐ శివరాకేష్ బాబాకు ప్రత్యేకపూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **కోవూరు :** స్థానిక సాయిబాబా మందిరం, సత్రం వీధిలోని సాయిబాబా ఆలయం, పడుగుపాడులోని సాయిబాబా మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు.


ముత్తుకూరు : వల్లూరులో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

● **రాపూరు :** సాయిబాబా మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పాదుక పూజ, పంచామృత అభిషేకం, హారతి, తదితర పూజలు నిర్వహించారు. పల్లకీసేవ నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.

● **కొడవలూరు :** మండలంలో నార్తురాజుపాలెం గ్రామంలో వెలిసి వున్న సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని గ్రామోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి గ్రామోత్సవం భక్తులు నైవేద్యాలు సమర్పించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

● **ఇందుకూరుపేట :** నిడుముసలి గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో దువ్వూరు పావని, మధుసూదన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పల్లకీసేవ నిర్వహించి, అన్నదానం చేశారు.


వెంకటాచలం : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి


మనుబోలు : జట్లకొండూరులో బాబాకు పూజలు చేస్తున్న ఎస్‌ఐ శివరాకేష్


ఇందుకూరుపేట : స్వామికి పల్లకీసేవ నిర్వహిస్తున్నభక్తులు

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం!

కొడవలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పేదల అభివృద్ధి సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే సాధ్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కొడవ లూరు, టపాతోపులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం గురువారం జరిగింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, మండిపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, జొన్న శివకుమార్, గరికపాటి రాజా, పాటూరు రమేష్, కోవూరు వెంకీ, పంది శ్రీనివాసులు, వేనీల్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట : రావూరు, పున్నూరులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కిషోర్ యాదవ్, ఏడుకొండలు, బాలబొమ్మ వెంకటేశ్వర్లు, బాలబొమ్మ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● మనుబోలు : వడ్లపూడి పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి శృతిరెడ్డి పర్యటించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొని చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రామకృష్ణయ్య, ఏఎంసీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు రఘురామ నాయుడు, సర్పంచు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రాపూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న అధికారులకు సూచించారు. రాపూరు పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో భవానీ, తహసీల్దారు లక్ష్మీనరసింహం, జడ్పీటీసీ ప్రసన్న, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు సన్మానం

ముత్తుకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి సందర్భంగా ముత్తుకూరుకు చెందిన జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణను హైదరాబాద్‌కు చెందిన జేకేఆర్ ఆస్ట్రో రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎన్వీఆర్‌పీ రాజా ఘనంగా సత్కరించారు. ఎన్వీ రాఘవాచారి గురు పూజోత్సవ సభలో జ్యోతిష శాస్త్రంలో మురళి సేవలను గుర్తించి సత్కరించారు. కార్యక్రమంలో ప్రఖ్యాత జ్యోతిషులు రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి ఇండియన్ రెడ్‌క్రాస్ పతకం

ముత్తుకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నేలటూరులోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పతకం లభించింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ అధ్యక్షులు, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఎస్‌ఈ ఐఎల్ ఎనర్జీ సీఎస్‌ఆర్ హెడ్ ఆల్బర్ట్ డేవిడ్ పీటర్ రెడ్‌క్రాస్ పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్లాంట్‌లో జరిగిన అభినందన సభలో సీఈఓ జనమేజయ మహా పాత్ర మాట్లాడుతూ నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి 150 కిలో వాట్ల వైద్య పరికరాలను అందించామన్నారు. క్యాన్సర్ రోగుల చికిత్స, సంరక్షణను మెరుగుపరచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టామన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచి


టీడీపీలో చేరిన సర్పంచు మేకల ప్రసన్న, అనుచరులు

విడవలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సంస్కారంలేని మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలసి పని చేయలేమని ఊటుకూరు పెద్దపాళెం గ్రామ సర్పంచు మేకల ప్రసన్న, ఆయన అనుచరులు గురువారం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీపీఆర్ నివాసంలో స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సమక్షంలో వీరు పార్టీలో చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని అసభ్యకరంగా మాట్లాడిన ప్రసన్నతీరు పట్ల మహిళగా తనని కలచి వేసిందన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యవహరించిన తీరుకు నిరసనగా పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరానన్నారు. టీడీపీ నాయకులు మీనంగారి తిరుపతయ్య, సున్నపు పాపారావు, మీనంగారి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతోనే
బీసీ హాస్టల్ మంజూరు

మనుబోలు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతోనే అక్కంపేట గ్రామంలో బీసీ హాస్టల్ మంజూరైందని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం అక్కంపేటలో బీసీ హాస్టల్‌ను జిల్లా పరిషత్ చైరపర్సన్ ఆనం అరుణమ్మ ప్రారంభించారు. పేద బీసీ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని, హాస్టల్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచు జాంబ వతమ్మ, ఎంపీడీవో జలజాక్షి, ఎంఈవో రమేష్, విద్యాకమిటీ చైర్మన్ అంబటి శ్రీనువాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను పూర్తిచేయాలి

కలువాయి: ఉపాధి హామీ సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని నెల్లూరు క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె ఉపాధిహామీ పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

మత్స్యరంగ అభివృద్ధికి ప్రాధాన్యం

ముత్తుకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మత్స్యరంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరు మత్స్య కళాశాలలో గురువారం నిర్వహించిన జాతీయ మత్స్య రైతుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ బాల సుబ్రహ్మణియన్, ప్రొఫెసర్ మాధవన్, టీడీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున యాదవ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, అనీల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

మనుబోలు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పల్లెలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాగితాలపూరులో ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా 250 గ్రామ పంచాయతీల్లో ఇంటింటా చెత్తసేకరణపై నిఘా ఉంచామన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శి చెంచమ్మ, సర్పంచు చెముడుగుంట ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బడే.. భవిష్యత్తుకు పునాది!


బుచ్చి : భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి,


ముత్తుకూరు : గిరిజన విద్యార్థులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి


రాపూరు : బహుమతులు ఇస్తున్న ప్రసాద్‌నాయుడు

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ● ఉత్సాహంగా పీటీఎం ● స్కూళ్ల అభివృద్ధిపై చర్చ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లల భవిష్యత్తుకు బడే పునాది అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్‌కేఆర్‌ఎస్, డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరిగిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల (పీటీఎం) ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఆమె హైస్కూల్‌లోని సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేశారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్య లను పెద్దలు, విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే హెచ్చరించారు. తాను మళ్లీ స్కూలుకు వచ్చేలోపు తీరు మారాలని హెచ్చరించారు.

● **మేడం.. ఈ రోజు మీరొచ్చారనే మంచి భోజనం**

మెగా పీటీఎం అనంతరం విద్యార్థులు ఎమ్మెల్యే ముందు సమస్యలను ఏకరువు పెట్టారు. ఉడకని అన్నం, రుచి లేని కూరలు, కుళ్లిపోయిన గుడ్లు పెడుతున్నారని, ఈ రోజు మాత్రం మీరు వస్తున్నారని నాణ్యమైన భోజనం వండారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్నం తాము తినడంలేదని తెలపగా, వెంటనే ఎమ్మెల్యే స్పందించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్యతను పరిశీ లించారు. భోజనంలో నాణ్యత లోపిస్తే సహించబోమని తీవ్రంగా హెచ్చరించారు. రెండు నెలలైనా ప్రస్తుత హెచ్‌ఎం, మాజీ హెచ్‌ఎం రికార్డులు స్వాధీనం చేయక పోవడంతో రెండు రోజుల్లో రికార్డులు అందజేయాలని ఎంఈఓ దిలీప్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీడీవో నారాయణరెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, రూరల్ అధ్యక్షుడు జగదీష్, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, కే. కిషోర్ నాయకులు పాల్గొన్నారు.

ముత్తుకూరు : కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముత్తుకూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన మల్లిక, వర్షితలను దత్తత తీసుకుని, వారి చదువుకు సోమిరెడ్డి ఫౌండేషన్ ద్వారా తోడ్పాటు నందిస్తామన్నారు. ముత్తుకూరు కెనరా బ్యాంకు ద్వారా సీఎస్‌ఆర్ నిధులతో కొన్న 20 కంప్యూటర్లను బ్యాంక్ ఆర్‌ఎం రాజ్‌కుమార్, మేనేజర్ సాయికుమార్‌లు ఎమ్మెల్యే ద్వారా పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ అధ్యక్షురాలు వర్షిణి, ఎంఈవోలు, మధుసూదన్, హేమసుందర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● **కోవూరు :** స్థానిక టీఎన్‌సీ జూనియర్ కళాశాలలో పీటీఎం సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ సికందర్, పూర్వ విద్యార్థులు చేజర్ల వేంకటేశ్వర్లు రెడ్డి, గాదిరాజు అశోక్ కుమార్, సత్యనారాయణ సింగ్, మధు, శశివర్ధన్, ఇంటూరి విజయ్ మాట్లాడారు.

● తోటపల్లిగూడూరు : విద్యా విధానంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దూరదృష్టితో విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర పేర్కొన్నారు. మండలంలోని కోడూరు అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గురుకులం డీసీఓ ప్రభావతి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ, శ్రీనివాసులు, పోలంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ ఆత్మకూరు రాగూర్, ఊటుకూరు అవినాష్ పాల్గొన్నారు.

● **రాపూరు :** విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం శ్రద్ధగా చదువు కోవాలని రాపూరు మండల పరిషత్ అధికారిణి మారెళ్ల భవానీ తెలిపారు. గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించారు. కండలేరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ భారతి అధ్యక్షతన, కండలేరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మీ అధ్యక్షతన మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి నువ్వుల శివరామ కృష్ణ, తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి టీఎన్ ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు. రూ.7 లక్షలతో డార్మెంటరీ భవనాన్ని, గురుకుల పాఠశాలలో రూ. 6 లక్షల సొంత నిధులతో డయాస్ నిర్మాణం చేపడతానని టీఎన్ ప్రసాద్‌నాయుడు హామీ ఇచ్చారు.

రాష్ట్ర మంత్రి ఆనం జన్మదిన వేడుకలు

చేజర్ల : రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండ ల కేంద్రమైన చేజర్లలో టిడిపి మండలాధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా షేక్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సమర్థత గల ఏకైక నాయకుడు ఆనం రాయనారాయణరెడ్డి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు రావి పెంచలరెడ్డి, అన్నలూరు శ్రీనివాసులనాయుడు, తలపనేని జయంతులు నాయుడు, కొమ్మి సిద్దులనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆదురుపల్లిలో చీర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, చిత్తలూరు గ్రామంలో మోదేపల్లి పెంచలనాయుడు, చిత్తలూరు యూత్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.


చేజర్లలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



గాంధీబొమ్మ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై
దాడి హేయమైన చర్య

● **నెల్లూరులో జర్నలిస్టుల ఆందోళన**

నెల్లూరు (వైద్యం) జూలై 10 (ఆంధ్రజ్యోతి) : బంగారుపాళెంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడి చేయటం దారుణమంటూ గురువారం సాయంత్రం నెల్లూరులో జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని గాంధీబొమ్మ చుట్టూ తిరుగుతూ జగన్ అనుచరులు ఇలాంటి దాడులకు పాల్పడటం సిగ్గుచేటని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు భవన్ ఇన్‌చార్జి మల్లికార్జునరావు మాట్లాడుతూ జర్నలిస్టులపై ఇలాంటి దాడులు చేయటం హేయమైన చర్య అని, జగన్ గుండాల్లారా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఈ నిరసనలో జర్నలిస్టులు బి.నాగరాజు, మహేష్, అమరేంద్ర, ప్రవీణ్, రోహిత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల మందుల టెండర్ రద్దు చేయాలి

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పశువుల మందుల కొనుగోలుకు పాత నిబంధనలతోనే కొత్త టెండరును పిలవాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పశుసంవర్థక శాఖను కోరారు. నాసిరకం మందులు సరఫరా చేసే కంపెనీలకు అనుకూలంగా కొత్త నిబంధనలు పెట్టి, టెక్నికల్ బిడ్ ఓపెన్‌కు సిద్ధమౌతున్న నేపథ్యంలో ఆ టెండరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.15కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీలను టెండరు ద్వారా పిలవాల్సి ఉండగా.. టర్నోవర్‌ను రూ.12.5కోట్లకు కుదించడం వల్ల మందుల నాణ్యత ప్రశ్నార్థకమౌతుందన్నారు. 2018 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయిలో మందులు కొనే పద్ధతి ఉండగా, ఇప్పుడు జిల్లా పశువైద్యాధికారి మందులు కొనుగోలు చేసే పద్ధతిని ప్రవేశపెట్టడం సరికాదన్నారు.

స్వదేశానికి చేరుకున్న నజీర్

● **నరకం నుంచి బయటపడ్డా : నజీర్**


చైన్నైలో తండ్రి కాలేషాతో నజీర్

కలువాయి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశంలో చిక్కుకు పోయి అక్కడ 8నెలలుగా యజమాని చేతిలో నరక యాతన అనుభవిస్తున్న నెల్లూరు జిల్లా కలువాయి మండలం కుల్లూరుకు చెందిన షేక్ నజీర్ ఎట్టకేలకు గురువారం రాత్రి స్వదేశానికి చేరుకున్నారు. బుధవారం రాత్రి సౌదీఅరేబియా నుంచి విమానంలో బయలుదేరిన నజీర్ ముందుగా ఢిల్లీకి చేరుకుని అక్కడ నుంచి గురువారం రాత్రి 8గంటలకు చెన్నై విమానాశ్రయానికి వచ్చారు. కొడుకు రాక కోసం ఎదురుచూస్తున్న నజీర్ తండ్రి కాలేషా కొడుకును చూసి బోరున విలపించారు. తండ్రి, కుమారుడు కలసి కుల్లూరులోని ఇంటికి కారులో చైన్నై నుంచి బయలుదేరినట్లు తెలిపారు. చెన్నైలో దిగిన తరువాత ఆంధ్రజ్యోతితో నజీర్ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి, ఏపీ ప్రభుత్వం, సౌదీలోని తెలుగు ప్రవాసీయుల సంఘం సాటా సెంట్రల్ ప్రతినిధులు షేక్ జానీ బాషా, రంజత్, ముజమ్మీల్, నరేంద్రల సాయంతో నేను ఇండియాకు ప్రాణాలతో వచ్చానని, వారికి నా జీవితాంతం రుణపడి ఉంటానని కన్నీటి పర్యంతం అయ్యారు. 8 నెలలుగా సరిగా తిండి కూడా లేకుండా అక్కడ నేను అనుభవించిన నరకం ఎవ్వరికీ రాకూడదన్నారు. బతుకు తెరువు కోసం 8నెలల క్రితం ఏజెంట్ మాయ మాటలు నమ్మి సౌదీకి వెళ్లి అక్కడ మారుమూల పల్లెలో పశువుల కాపరిగా యజమాని చేతిలో నరకం చూశాడు. ఈ విషయాన్ని నజీర్ తన తండ్రికి వీడియో పంపారు. దీంతో ఆంధ్రజ్యోతిలో నజీర్ కష్టాలపై కథనం ప్రచురితమైంది. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సాటా సెంట్రల్ ప్రతనిధులు ఎంతో శ్రమ పడి నజీర్‌ను క్షేమంగా ఇంటికి చేర్చారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి


మృతిచెందిన చుక్కల దుప్పి

ఉదయగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ. అయ్యవారిపల్లి గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో చుక్కల దుప్పి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సమీప అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం గ్రామ శివారులోకి వచ్చిన దుప్పిపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమి దుప్పిని రక్షించారు. అయినా దుప్పి తీవ్రంగా గాయపడడంతో మృతిచెందింది. గ్రామస్థులు ఎస్‌ఐ శ్రీనుకు సమాచారం అందించడంతో ఆయన రేంజ్ అధికారి కుమారరాజాకు తెలియజేశారు. రేంజర్ ఆదేశాల మేరకు కొత్తపల్లి ఇన్‌చార్జి ఎఫ్‌బీవో గౌతమ్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని మృతిచెందిన దుప్పిని ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. శుక్రవారం దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి రిజర్వు ఫారెస్టులో దహనం చేయనున్నట్లు వారు తెలిపారు.

కులంపేరుతో దూషించారని ఫిర్యాదు

కొండాపురం, జూలై10(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించారని మండలంలోని పార్లపల్లికి చెందిన ఆశా వర్కర్ గుంటగాని మేరీ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు, గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పీటీఎంకి మెడికల్ డ్యూటీకి మేరీ వెళ్లింది. మేరీ కోడలు గుంటగాని సుష్మిత అదే పాఠశాల విద్యాకమిటీ చైరపర్సన్‌గా ఉండగా, కొద్ది రోజులక్రితం మధ్యాహ్న భోజనం వండే గడ్డం ప్రభావతిని వంటలు సరిగా చేయలేదని ప్రశ్నించింది. దీంతో కక్ష కట్టి పాఠశాలలో తమ కాలనీకి చెందిన వారితో మాట్లాడుతుండగా ప్రభావతి, కుటుంబసభ్యులు నన్ను, నా కోడలిని కులం పేరుతో దూషించిందని మేరీ ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతటితో ఆగక చేతులతో కొట్టి కిందపడేసిం దన్నారు. ఈ విషయమై విచారించి న్యాయం చేయాలని ఆమె పోలీసులను కోరారు.

గాంధీ జనసంఘంలో బాలిక మృతి

కోవూరు, జూలై10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవూరు చెరువు కట్ట పక్కన ఉన్న గాంధీ జనసంఘంలో ఓ బాలిక గురువారం ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. బాలిక మృతి విషయమై కోవూరు పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	121
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 540



కనుల పండువగా శ్రీకృష్ణరాయబారం అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో గురువారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం అలంకారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం విశేష పూజలు, చప్పర ఉత్సవం జరిగాయి. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలను ఈవో జానకి పర్యవేక్షించారు.

శ్రీకృష్ణ రాయబారం అలంకరణలో ఉత్సవమూర్తులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

● విశేష అభిషేకాలు, పూజలు ● సాయి మందిరాలు కిటకిట



గాంధీనగర్ కృష్ణమందిరంలో సత్యనారాయణ వ్రతం



సత్యసాయి దివ్య రథోత్సవంలో భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గురు పౌర్ణమి పర్వదినాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మూలస్థానేశ్వరాలయంలో గురు దక్షిణామూర్తి అభిషేకానికి భక్తులు బారులుతీరారు. మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో వెలిసి ఉన్న వ్యాస భగవాన్ విగ్రహానికి అభిషేకాలు, పూజలు చేశారు. మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. మూలా పేట గురు నిలయంలో భగవాన్ వెంకయ్య స్వామికి, గురుదేవులు మాకాని వెంకటరావుకు విశేష అభిషేకాలు, భజనలు, అన్న ప్రసాద వితరణ జరిగాయి.

● నగరంలోని ఇస్కాన్ సిటీలో ఉన్న హనుమాన్ ఆలయంలో భక్తి స్వరార్చన జరిగింది. బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి, హర్షవర్ధిని, పద్మావతి, వస్త్రలత తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ నేతల ఆధ్వర్యంలో మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం వద్ద గోపూజ జరిగింది. నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ ఆది గురువు శివుడు, జగద్గురువు మహావిష్ణువుతోపాటు సమస్త దేవతలు గోవులో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏవీ సుబ్బయ్య, టీ శీనివాసులు, శిరీష, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

● గాంధీనగర్ (గాంధీబొమ్మ) షిరిడీ సాయిబాబా మందిరంలో వెయ్యి మందికిపైగా భక్తులు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాల్లో పాల్గొన్నారు. అనంతరం సహస్ర నామ పూజలు జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి షిరిడీ హారతులు జరిగాయి. భక్తులందరికీ ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 18వతేదీ వరకు గురుపౌర్ణమి వేడుకలు జరుగుతాయన్నారు. ఈ వేడుకలను కమిటీ సభ్యులు పైడిపాటి సుధాకర్ రావు, దువ్వూరి జయమ్మ, కొల్లి శ్యామసుందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

● బాలాజీనగర్ సాయిదర్బార్ (అద్దాల మందిరం)లో వేడుకలు జరిగాయి. ఉదయం కాకడ హారతి, ప్రత్యేక అభిషేకాలు, ఓంసాయి శ్రీసాయి జయజయసాయి నామ సంకీర్తనలతో మందిర పరిసరాలు మా రుమోగాయి. సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

● చిల్డ్రన్స్ పార్కు వద్ద గల సాయిసదన్‌లో గురు పౌర్ణమి వేడుకల సందర్భంగా భక్తులతో పాలాభిషేకాలు జరిగాయి. షిరిడీ హారతులు, విశేష పూలంగిసేవ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.



గాంధీనగర్ సాయిబాబాకు హారతి..



విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోతున్న బాబా మందిరం

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో సత్యసాయి రథయాత్ర

నెల్లూరు(సాంస్కృతికం) జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా సాగుతున్న ప్రేమ ప్రవాహిని రథం గురువారం నగరానికి వచ్చింది. ఆ రథానికి సత్యసాయిబాబా భక్త బృందం ఘన స్వాగతం పలికింది. సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు సుధాకర్, సమితి సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో గురుపౌర్ణమి - పేరెంట్స్ డే

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రామయ్యబడి, ఫత్తేఖాన్‌పేట, పరమేశ్వరి నగర్ మున్సిపల్ పాఠశాలల్లో గురుపౌర్ణమి, గ్రాండ్ పేరెంట్స్ సమావేశాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా స్కూల్ పేరెంట్స్ కమిటీ కోఆప్షన్ సభ్యుడు, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరందూరు సురేంద్రబాబు హాజరయ్యారు.

వేదగిరి క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు



గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు

నెల్లూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో గురు పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, అలంకరణ అనంతరం చిన్న గరుడ వాహనంపై గిరిప్రదక్షణ జరిపారు. ఆలయ ఈవో గోపి, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షించారు. అల్లీపురంలోని సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. టీడీపీ నేత గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

గురువులకు సత్కారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురు పౌర్ణమి సందర్భంగా నగరంలోని సంతపేటలో ఉన్న గుంటబడిలో అవార్డులు పొందిన గురువులను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ సత్కరించారు. గురుపౌర్ణమి రోజున ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.

ప్రసన్నను అరెస్టు చేయాలి

● భారత్‌సేవా ఫౌండేషన్

నెల్లూరు(హరనాథపురం), జూలై 10(ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై నీచమైన వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని భారత్ సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు కే రాజశిఖామణి, కార్యదర్శి షేక్ ఖాసీం ఓ ప్రకటనలో కోరారు. సభ్య సమాజంలో ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు ఎవరు చేసినా అది క్షమించరాని నేరమని పేర్కొన్నారు. రోత వ్యాఖ్యలు చేసిన ప్రసన్నను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నెల్లూరు(విద్య), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 15, 16 డివిజన్లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. జగదీష్‌నగర్‌లో రూ.25లక్షలతో నిర్మిస్తున్న రోడ్డును, బాలాజీ నగర్‌లో కాలువ పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడాది సుపరిపాలన సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, బాలాజీ, సాయిరాం, పెంచల చౌదరి, ప్రవీణ్ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నామని నెల్లూరు-1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని సలహాలు, సూచనలు అందించే వారు 9959225641 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా విద్యార్థినులతో కలెక్టర్ ఆనంద్



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

పట్టుదలతోనే విజయాల సాధన

● పీటీఎం 2.0లో మంత్రి నారాయణ

నెల్లూరు (విద్య), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థి అధైర్యపడకుండా పట్టుదలతో చదివితే మున్ముందు విజయాలను సాధించవచ్చని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ఆర్‌ఎస్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులతో చర్చించి విద్యార్థుల బలహీనతలను గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్ఫూర్తితో తాను కూడా ఆర్‌ఎస్‌ఆర్‌ఎం హైస్కూల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పలు రకాల క్రీడాపోటీలు నిర్వహించిన అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డీఈవో బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే పాఠశాలల అభివృద్ధి : కలెక్టర్

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతోనే పాఠశాలల అభివృద్ధి, విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. నగరంలోని పప్పులవీధి వైవీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరినీ గమనించడం సాధ్యం కాదని, ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా ప్రతీరోజు కొద్దిసేపు పిల్లలతో ముచ్చటించి విద్యాపరమైన అంశాలతోపాటు ఇతర అంశాలను కూడా గుర్తించాలని కోరారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఈవో బాలాజీరావు, ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఏఎంవో సుధీర్‌బాబు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ఎంఎస్‌ఎం స్కూల్‌ను తీర్చిదిద్దుతా: నుడా చైర్మన్ కోటంరెడ్డి



విద్యార్థులతో కలచాలనం చేస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో 14వ డివిజన్ లో ఉన్న మల్లెల సంజీవయ్య మున్సిపల్ స్కూలును కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. గురువారం ఆ స్కూల్‌లో జరిగిన పేరెంట్ టీచర్స్ మీట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ స్కూల్‌తో తనకు విడదీ యరాని అనుబంధం ఉందని, కోటి రూపాయలతో పాఠశాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. చిన్నతనం నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, ఉన్నత శిఖరాలు చేరుకున్న తర్వాత తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని కోరారు. తన కూతురు నెల నెల పంపే డబ్బుతో కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు సాయం అందిస్తున్నామని చెప్పారు. వాటితో స్కూల్‌ను కూడా అభివృద్ధి చేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

200 మంది ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ విద్య

● వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు (వైద్యం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ వక్ఫ్‌బోర్డు తరపున వచ్చే విద్యా సంవత్సరంలో 200 మంది పేద ముస్లిం విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఉచిత కార్పొరేట్ రెసిడెన్షియల్ విద్యను అందిస్తామని వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలియచేశారు. గురువారం నగరంలోని జెండావీధి పీఎస్‌ఎం జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్ - టీచర్స్ సమావేశంలో అజీజ్ పాల్గొన్నారు. తల్లితండ్రులతో ముఖా ముఖి నిర్వహించారు. తల్లిదండ్రులు పలు సమస్యలు తెలియచేయ గా వెంటనే వాటిని పరిష్కరించమని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఇటీ వల 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సా హక నగదును బహూకరించారు. కళాశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడు తూ గురుపౌర్ణమి రోజు పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహణ ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాఫర్, షరఫ్, జమీర్, రబ్బాని, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, తదితరులు

ప్రశాంతంగా పీటీఎం



ప్రభుత్వం పంపిణీ చేసిన బ్యాగును విద్యార్థికి అందచేస్తున్న వేదగిరి మాజీ చైర్మన్

నెల్లూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పేరెంట్ - టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నెల్లూరు రూరల్లో ప్రశాంతంగా ముగిశాయి. దేవరపాళెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీటీఎంలతో విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మధ్య సత్సంబంధాలు ఏర్పడుతాయని చెప్పారు. విద్యార్థి లోపాలను ఇరువురు సరిచేసేందుకు ఈ సమావేశాలు వేదికగా మారుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రిని అందచేశారు. కాగా, మాదరాజుగూడూరులో జరిగిన తల్లిదండ్రుల సమాశంలో ఎంపీపీ బూడిద విజయకుమార్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ గున్నయ్య పాల్గొన్నారు. సౌత్‌మోపూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాణిశ్రీ జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశాల్లో సీపీఐ సీనియర్ నాయకుడు పముజుల దశరథరామయ్య, ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, హెచ్‌ఎం అన్వర్, అధ్యాపకులు విజయ్‌కుమార్, టీడీపీ నాయకుడు రాపూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరిచేలా మాట్లాడటం తగదు

● మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని కించపరిచే విధంగా మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడడం తగదని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత పేర్కొన్నారు. గురువారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రశాంతి రెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లో స్త్రీలు పురుషులతో సమానంగా పరిగెడుతున్నారన్నారు. చరిత్రలో ఆడవారిని ఇబ్బందిపెట్టిన వాళ్లు ఎవరు బాగుపడలేదనే విషయాన్ని గుర్తించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవల్లిక, అనూష, భూదేవమ్మ, విజయమ్మ, గిరిజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

22వ డివిజన్‌లో పీటీఎం

నెల్లూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో ఉపాధ్యాయులతోపాటు పిల్లల తల్లిదండ్రులను ఒకే చోటకు తీసుకువచ్చి భారీ కార్యక్రమానికి నాంది పలికిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు చెప్తున్నామని టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి అన్నారు. 22వ డివిజన్ బీవీనగర్ కేఎన్‌ఆర్ పాఠశాలలో జరిగిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం)లో ఆయన పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. అధికారులు, కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీపీఆర్ పేరు చెబితే ప్యాంటు తడిచిపోతుంది

● టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి



మాట్లాడుతున్న కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వీపీఆర్ పేరు చెబితే చాలు వైసీపీ నాయకులకు ప్యాంటు తడిచిపోతోందని టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. ప్రశాంతి రెడ్డిపై నీచపు మాటలాడిన ప్రసన్నను, వెనుక నుంచి ప్రోత్సహించిన అనిల్‌కుమార్ యాదవ్‌ను మహిళా లోకం ఛీదరించుకుంటోందన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ ఒక టపాస్ బాలు లాంటివాడని ఎద్దేవా చేశారు. గతంలో ఎంపీ వేమిరెడ్డి దంపతుల కాళ్లు పట్టుకుని డబ్బులు దండు కున్న చరిత్ర మర్చిపోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్దు సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, సాయి కృష్ణారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వ్యాఖ్యలను ఖండిస్తున్నా : బూదాటి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 10(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నానని శాసన మండలి మాజీ సభ్యుడు బూదాటి రాధయ్య ఓ ప్రకటనలో తెలిపారు. తన స్థాయిని మరచి ప్రసన్న చేసిన అసభ్యకరమైన నీచ మాటలకు మహిళలు, ఓటర్లు ఛీదరించుకుంటున్నారని పేర్కొన్నారు. గత ఎన్నికలతో రాజకీయ జీవితం, ప్రస్తుతం ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలతో వ్యక్తిగత జీవితం రెండూ ప్రసన్నకు దాదాపుగా ముగిసిపోయాయని కోవూరు నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నా రని తెలిపారు. మహోన్నత చరిత్ర కలిగిన కుటుంబంలో జన్మించిన ప్రసన్న చీడపురుగులా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్టాండులో వైద్య శిబిరం



సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో గురువారం మెడికవర్ ఆసుపత్రి వైద్య శిబిరం నిర్వహించింది. దీనిని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎన్‌ఎంయూఏ నాయకులు, తదితరులు సురేష్‌రెడ్డిని సత్కరించారు.

నర్సుల వృత్తి పవిత్రమైంది

● 'బొల్లినేని' క్యాపింగ్ సెర్మనీలో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వక్తలు

నెల్లూరు రూరల్, జూలై 10,(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో నర్సుల పాత్ర ఎంతో పవిత్రమైందని పలువురు వక్తలు అభిప్రా యపడ్డారు. గురువారం నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద బొల్లినేని నర్సింగ్ కళాశాలలో ల్యాప్ లైటింగ్, క్యాపింగ్ సెర్మనీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నర్సింగ్ కోర్సుల్లోకి వస్తున్న వారికి స్వాగతం పలికి, తుది ఏడాది విద్యార్థులకు పత్రాలు అందచేశారు. కిమ్స్ సీఈవో టీ గిరినాయుడు, డైరెక్టర్ శివమాల, ప్రిన్సిపాల్ అశోక్, న్యూరాలజిస్ట్ వీ అభినయరెడ్డి, ఏసీఎస్ఆర్ నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ టీ విజయసేన, కిమ్స్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ ఎస్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య మేధో సదస్సులతో ఎంతో ఉపయోగం

నెల్లూరు (వైద్యం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగే వైద్య మేధో సదస్సులు వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నారాయణ ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ వెల్లడించారు. గురువారం ఆ ఆసుపత్రిలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఇటీవల మూడు రోజులు జరిగిన రాష్ట్ర స్థాయి న్యూరోకాన్ సదస్సు విజయవంతమైందని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 623 మంది న్యూరాలజీ వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైద్య విద్యాసంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ బీజూరవీంద్రన్, ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా చిలకపాటి

బిట్రగుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా చిలకపాటి వెంకటేశ్వర్లును గురువారం ఎంపిక చేశారు. త్రీ మెన్ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన తీర్మాన మినిట్‌బుక్‌లో సంతకాల అ నంతరం చిలకపాటి, ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. త్రీమెన్ కమిటీలో వాయిల సుధా, లక్కాకుల మాధవరావులను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.



అబ్బో.. ఈ కాలనీ ఎంత బావుందో...! కొనదిన్నె గిరిజనకాలనీలో రోడ్డుపై కొండముచ్చు



మీ వెనుకే నేనుంటా..!



ఈ చిన్నారికి పేలు దువ్వి జడ వేస్తా...

ఆ కాలనీ నేస్తం... కొండముచ్చు !



బాలికకు కొండముచ్చుకు స్నేహం ఎలా కుదిరిందో...? ఆసక్తిగా చూస్తున్న కాలనీవాసులు

జంతు ప్రేమికులను అబ్బుర పరుస్తూ.. చిన్నారులపై ప్రేమ చూపుతూ ఓ కొండముచ్చు కావలి కొనదిన్నె గిరిజనకాలనీకి కాపలాగా ఉంటోంది. ఎక్కడ తప్పిపోయిందో తెలియదు కానీ, కాలనీవాసులు పెట్టే పండ్లు, అన్నం తినడంతోపాటు కాలనీలోని టెంకాయచెట్లపై రాత్రిళ్లు నిద్రిస్తూ అక్కడకి కోతులు రాకుండా చూస్తున్నది. కాలనీవాసులు ప్రతి రోజూ కూలి పనులకు వెళ్తున్నా, ఇంటి వద్ద ఉండే చిన్నాపెద్దా ఎవరో ఒకరు దానికి ఆహారం అందిస్తున్నారు. ఇక అది చిన్నారులకు తోడుగా నిలవటంతోపాటు వారి తలలో పేలు చంపుతూ కాలనీలో అటూఇటూ తిరుగుతూ రాజసం ప్రదర్శిస్తున్నది. కొండ ముచ్చుకు స్నానాలు చేయించటంతోపాటు అది కనిపించకపోతే దానికోసం చిన్నారులు ఏడుస్తూ వీధుల వెంట తిరగడం విశేషం. ఈ విషయాలు గమనించనివారు 'ఈ నాటి బంధం... ఏనాటిదో... అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఎవరిదీ పాపం!

ఆంధ్రజ్యోతి విచిత్రం

జగనన్న విద్యా కానుకలు అడవిపాలు

గత ప్రభుత్వం జగనన్న విద్యా కానుకల పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బూట్లు, బెల్టులు అందజేసింది. అయితే అవన్నీ ఇప్పుడు ఉదయగిరి శివార్లలోని సీతారామపురం మార్గంలోని అటవీ ప్రాంతంలో గురువారం దర్శనమిచ్చాయి. అప్పట్లో పంపిణీ చేయకపోవడం, ప్రభుత్వం మారడంతో వందల సంఖ్యలో బూట్లు, బెల్టులను గోతాల్లో మూట గట్టి ముళ్లపొదల్లో పడేశారు. అయితే గోతాలపై మర్రిపాడు మండలం కేజీబీవీ పాఠశాల అని రాసి ఉండడంతో ఎవరో వాహనంలో తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. అటు గా వెళుతున్న కొందరు వాహనదారులు కవర్లు కూడా తీయని బూట్లు, బెల్టులను చూసి చేతపట్టుకుని వెళుతున్నారు.



- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సమర్థవంతంగా పీ-4 అమలు: కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 10(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీ-4 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ-4పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లాలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే జిల్లాలో పలు కంపెనీల పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించామని, అందరినీ సమన్వయం చేసుకుంటూ జిల్లాలో పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర కమిషనర్ నందన్, సీపీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్.. సేద్యంలో డాన్!

కూలీల సమస్య, అదనపు ఖర్చులకూ చెక్! • 80 శాతం రాయితీపై పంపిణీ

ఐదుగురు సభ్యులు గల రైతులకు అందజేత • ఇప్పటికే 13.. భవిష్యత్తులో మరిన్ని...

వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించింది. అంతేగాక రసాయనిక మందుల పిచికారీకి అవసరమైన డ్రోన్లను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. ఇప్పటికే 13 గ్రూపులకు డ్రోన్లు అందజేయగా, ఇంకా మరిన్ని డ్రోన్లను జిల్లాకు కేటాయిస్తోంది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



కోవూరులో ఓ రైతు గ్రూపునకు అందించిన డ్రోన్ (ఫైల్)



మరో 23 డ్రోన్ల పంపిణీకి సిద్ధం

వ్యవసాయంలో డ్రోన్ల పాత్ర కీలకం కాబోతోంది. కూలీల ఖర్చులు, ఎరువులు, పురుగు మందులు ఆదా చేసుకునే అవకాశం ఎంతో ఉంది. జిల్లా అవసరాలను బట్టి 41 డ్రోన్లను కేటాయించారు. ఇప్పటికే 13 గ్రూపులకు డ్రోన్లను పంపిణీ చేయడం జరిగింది. మరో రెండు, మూడు రోజుల్లో 23 డ్రోన్లను గ్రూపులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. పైలెట్లుగా శిక్షణ పూర్తి చేసుకుని బ్యాంకు డిపాజిట్లు చెల్లించిన వారికి పంపిణీ జరుగుతోంది.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

కూలీల కోసం ఎదురు చూడకుండా సాగుకు అవసరమైన నూతన సాంకేతికతను రైతులకు అందించి వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీకి కూలీల అవసరం లేకుండా 80 శాతం రాయితీపై డ్రోన్లు అందిస్తోంది. ఈ మేరకు జిల్లాకు 41 డ్రోన్లను కేటాయించింది. ఐదు గురు సభ్యులతో కూడిన బృందాలకు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 38 దరఖాస్తులు అందగా, ఇప్పటి వరకు 13 గ్రూపులకు డ్రోన్లను పంపిణీ చేశారు. గ్రూపులో ఒకరు డ్రోన్ పైలట్‌గా వ్యవహరిస్తారు. ఇంటర్మీడియట్ చదివి పాస్ పోర్టు కలిగి వారికి శిక్షణ కూడా ఇచ్చిన అనంతరం డ్రోన్లను అందజేస్తున్నారు.

• 80 శాతం రాయితీ..

రైతులకు ఎంతగానో ఉపయోగపడే డ్రోన్లను ప్రభుత్వం 80శాతం రాయితీపై అందిస్తోంది. డ్రోన్ ఖరీదు రూ.9.8 లక్షలు కాగా ఇందులో 80శాతం రాయితీ పోను రైతు వాటా కింద దాదాపు రూ.2లక్షలు చెల్లించాలి. అయితే మొదటగా డ్రోన్ ఖరీదులో దాదాపు 50శాతం వరకు గ్రూపు చెల్లించాల్సి ఉంటుందని, ఆ తర్వాత సబ్సిడీ నగదు గ్రూపునకు చెందిన బ్యాంకు ఖాతాలో జమవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే డ్రోన్లు తీసుకున్న గ్రూపులకు అతి త్వరలో సబ్సిడీ నగదు జమ అవుతుందని అధికారులు అంటున్నారు.

• డ్రోన్‌తో ఉపయోగాలివే..

ఎరువులు, పురుగు మందుల పిచికారీకి ఇప్ప టివరకు కూలీలపై ఆధారపడేవారు. సమయం ఎక్కువ తీసుకోవడంతో పాటు ఖర్చులు ఎక్కువే. అయితే డ్రోన్లతో ఎన్ని ఎకరాల్లో అయినా నిమిషాల్లో ఎరువులు, మందులు చల్లుకోవచ్చు. ఎకరా పొలంలో పిచికారీకి సరాసరి 7 నుంచి 9 నిమిషాలు సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ పద్ధతిలో మందులు పిచికారీ చేయడం వల్ల మందులు వృథా కాకుండా ఉంటాయంటున్నారు. పంట దిగుబడులు పెరుగుతాయి. ముఖ్యంగా రైతులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవు. అదేవిధంగా పైలెట్లకు ఉపాధి దొరికినట్టు అవుతుంది.



కసుమూరు దర్గాలో భక్తుల రద్దీ

కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు బారాషాహిద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా చివరి రోజు కావడంతో గురువారం కసుమూరు మస్తాన్ వలి దర్గాలో భక్తుల రద్దీ నెలకొంది. దర్గా పూజారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. దర్గాను పూలు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రొట్టెల పండుగ గురువారంతో ముగియడంతో కసుమూరుకు వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. వసతి ఏర్పాట్లను విజయవాడ వక్ఫ్‌బోర్డు అధికారులు సయ్యద్ రావూఫ్, మొహమ్మద్ రియాజ్ ఖాన్, షేక్ అలీషా, దర్గా ఈవో షేక్ షరీఫ్, కేర్ టేకర్ పఠాన్ అస్లాం ఖాన్ పర్యవేక్షించారు. పోలీస్ బందోబస్తు కొనసాగించారు.

సైనిక సంక్షేమ కార్యక్రమాలపై బ్రిగేడియర్ చర్చ



జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో బ్రిగేడియర్ వెంకటరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వీ వెంకటరెడ్డి, ఏడీ కెప్టెన్ సత్యప్రసాద్ గురువారం జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. మాజీ సైనికులకు అందించే సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్‌లో అమలు చేసే కార్యక్రమాలపై మాజీ సైనికులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ వింగ్ కమాండర్ శ్యాంప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ కృష్ణారెడ్డి, జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ, నాయకులు రత్నయ్య, బీజే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోటీలో బండ లాగుతున్న ఎడ్లు

బిట్రగుంటలో రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

బిట్రగుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంటలో వెలసి ఉన్న షిరిడీ సాయినాథుడి మందిర రజతోత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను మందిర వ్యవస్థాపకుడు కే బ్రహ్మానందం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. బాబామందిరంలో ప్రత్యేక పూజల అనంతరం బిట్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండలాగుడు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి ఆరు జతల ఎడ్లు పాల్గొన్నాయి. మార్కాపురానికి చెందిన బోడిచర్ల వీరాంజనేయస్వామి ఎడ్లు మొదటి స్థానం, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన ఎడ్లు రెండవ స్థానం, బాపట్లకి చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లు మూడవ స్థానం సాధించాయి. వారికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం టీడీపీ నేత మాలేపాటి నాగేశ్వరరావు, బీజేపీ నేత వీరాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

'రసంలో బల్లి' నమూనాల సేకరణ

నెల్లూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఓ ప్రముఖ హోటల్లో రసంలో బల్లి ఉండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆహార భద్రత సహాయ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం తన కార్యాలయం నుంచి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సదరు హోటల్లో రసంలో బల్లి వచ్చినట్లు ఫిర్యాదు అందిన వెంటనే తమ సిబ్బందిని పంపామని, అక్కడ రసం నమూనాలను సేకరించి ల్యాబొరేటరీకి పంపినట్లు వెల్లడించారు. అక్కడ్నుంచి వచ్చే ఫలితాలను బట్టీ కేసు నమోదు చేసి నిందితులను జేసీ కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు. ఇదే హోటల్లో గతంలో ఇడ్లీలో బొద్దింక వచ్చినట్లు ఫిర్యాదులు న్నాయని తెలిపారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం జూలై 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 165 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 28.870 టీఎంసీలు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,650 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో 102 గోత్ర నామాలతో ప్రదర్శించిన చలిమిడి, సారె

కన్యకాపరమేశ్వరికి చలిమిడి, సారె సమర్పణ

కావలి కొత్తబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరికి గురువారం మహిళలు 102 గోత్ర నామాలతో చలిమిడి, సారె సమర్పించారు. స్థానిక శ్రీప్రసన్న వేంకటేశ్వర భజన మండలి మహిళలు 102 గోత్రనామాలతో సలిమిడి, సారె తట్టలు పట్టుకుని బృందా వనం బజారు నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభయాత్రగా తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో లలితా సహస్రనామాలు, అన్నమాచార్య, పురందరదాసు కీర్తనలు ఆలపించారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

హత్య కేసులో నిందితుడికి జైలు, జరిమానా

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లెకి చెందిన ఆవుల వెంగయ్య హత్య కేసులో నిందితుడు తాడిబోయిన చిరంజీవికి గురువారం ఒంగోలు ఏడీజే, ఫ్యామిలీ కోర్టు 10 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ 5 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ మరిదినాయుడు తెలిపారు. ఈ హత్య కేసులో అడ్డొచ్చిన ఫిర్యాది రమణమ్మను గాయపరిచిన కేసులో అదే నిందితుడు చిరంజీవికి అదనంగా ఏడాది జైలుశిక్ష రూ 2 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.ఎస్‌ఐ కథనం మేరకు, మండలంలోని అయ్యవారిపల్లెలో 2018 అక్టోబరు 28న ఆవుల రమణమ్మ తన మేనళ్లుడు మంచాల మాలకొండ్రాయుడిని చంపుతున్నారని పెద్దగా కేకలు వేసింది. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న ఆమె భర్త ఆవుల వెంగయ్య రోడ్డుపైకి వెళ్లి చూడగా తాడిబోయిన చింజీవితో పాటు మరో ఆరుగురు మాలకొండ్రాయుడును రోడ్డుమీద పడేసి సిమెంటు రాళ్లతో తల మీద కొడుతున్నాడు. అడ్డు తీయడానికి వెళ్లిన వెంగయ్యను చిరంజీవి కాళ్లతో మర్మావయాలపై తన్నగా స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఆయన్ను చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. వెంగయ్య భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసి చార్జిషీట్ వేశారు. ఈ కేసులో గురువారం ఒంగోలు ఫ్యామిలీ కోర్టు చిరంజీవికి 10 ఏళ్ల జైలుశిక్ష, రూ 5 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆయనతో పాటు కుమ్మరి వీరయ్య, మంచాల కొండయ్య, చీమల రమాదేవి, కాకర్ల రత్తమ్మ, కుమ్మరి ధనమ్మ, మంచాల జయమ్మలకు వెయ్యి రూపాయలు జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణ

నెల్లూరు (లీగల్), జూలై 10 (ఆంధ్రజ్యోతి) మధ్యవర్తిత్వం చేసుకుంటే ఒనగూడే ఉపయోగాల గురించి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో శిక్షణ ఇచ్చారు. 27 మంది మీడియేటర్స్, అడ్వకేట్స్‌కి శిక్షణ తరగతులు నిర్వ హించారు. మధ్యవర్తిత్వం చేసుకుంటే వ్యాజ్యాల ఖర్చు తగ్గుతుందని, ఇరు పార్టీల మధ్య సామరస్యం లభిస్తుందని, అంతేగాకుండా కోర్టు ఫీజులు సంబం ధిత పక్షాలకు వాపసు వస్తుందని, డబ్బు అదా అయి ఆందోళన తగ్గుతుందని తెలిపారు. తొలుత ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీనియర్ ట్రెండ్ మీడియేటర్ అరుణాచలం ప్రసంగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరి కే వాణి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి

దోస రైతుల ఘోష!

ఉదయగిరి రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో వరి తరువాత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపుతుంటారు. ఈ నేపథ్యంలో ఇటీవల దోస సాగుకు అధికశాతం రైతులు పూనుకున్నారు. తొలుత ధరలు ఆశాజనకంగా ఉన్నా, క్రమేణా పెట్టుబడులు కూడా అందే పరిస్థితులు కనిపించడం లేదని సాగుదారులు వాపోతున్నారు.

• గిట్టుబాటు ధర కోసం...

నియోజకవర్గ పరిధిలోని ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, సీతారామపురం తదితర మండలాల్లో ఈ ఏడాది దోస సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో చేసేదేమిలేక వ్యాపారులు చెప్పిన ధరనే వేదంగా భావించి పంటను అమ్ముకుంటున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటను అతి తక్కువ ధరకే అమ్ము కొని మరింత అప్పుల భారం మోయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతుల వద్దకు వెళ్లిన వ్యాపారులు కేవలం కిలో రూ. 2కు మాత్రమే కొనుగోలు చేసి, మార్కెట్లో మాత్రం వినియోగ దారుల నుంచి సుమారు రూ. 25 వసూలు చేస్తున్నారు. కొంతమంది రైతులు ఎంతో ఆశతో పంటను వాహనాల్లో మార్కెట్‌కు తరలించినా ఫలితం లేకుండా పోతున్నది. అక్కడి వ్యాపారులు తాము చెప్పిందే ధర నిర్ణయిస్తుం డడంతో తిరిగి రవాణా ఖర్చులు భరించి వెనక్కు వెళ్లలేని రైతులు వారి చెప్పిన ధరకే అమ్ము కుంటున్నారు. ఇంచు మించు ప్రస్తుతం మార్కెట్లో 60కేజీల బస్తా కాయ రకాన్ని బట్టి రూ. 250 దాటడం లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో పెట్టుబడుల సంగతి అటుంచితే కనీసం కోత కూలీల ఖర్చు కూడా చేతికి అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొలాల్లోనే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

• గిట్టుబాటు ధర కల్పించాలి

తొలుత ఆశాజనకంగా ఉన్న ధరను చూసి తాము ఆశతో పంటల సాగుకు పూనుకున్నామని రైతులు తెలిపారు. వ్యాపా రులు ఇష్టానుసారంగా వ్యవహరించి తమను నట్టేట ముంచు తున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని మండిపడు తున్నారు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో వారున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దోసకాయలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పాడి రైతులకు అవగాహన

ఉదయగిరి రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళరావు నగర్, కొండాయపాళెం రైతుసేవా కేంద్రాల్లో గురువారం పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పోషణలో పశుగ్రాసం ప్రాముఖ్యత, పీకేసీసీ, ఉపాధిహామీ పథకం ద్వారా అందుతున్న రాయితీలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు మహేశ్వరి, ఖాజామొహిద్దీన్, కిషోర్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9312
వెండి కిలో ధర	రూ. 110300
వెండి ఒక గ్రాము	రూ. 113.30

న్యూస్ బాక్స్

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన



అన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు చల్లా

వింజమూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో అన్న క్యాంటీన్ పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు గురువారం టీడీపీ నాయకులు పరిశీలించారు. పార్టీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి చల్లా వెంకటేశ్వరయాదవ్ పనులను దగ్గర ఉండి పరిశీలించారు.

వడ్డెర రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఉదయగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఈనెల 27, 28వ తేదీల్లో నిర్వహించే ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు బత్తల నాగరాజు గురువారం ఓ ప్రకటనలో కోరారు. వడ్డెరలకు రక్షణ కల్పించాలని, ఎస్టీల జాబితాలో చేర్చాలని, క్వారీల్లో పనులు వడ్డెరలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన వడ్డెరలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉపాధి లక్ష్యాలను పూర్తిచేయాలి

కలువాయి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని నెల్లూరు క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె ఉపాధిహామీ పథకం అమలుపై క్షేత్ర సహాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 2025-26 సంవత్సరానికి 2.5 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 94,630 పనిదినాలు మాత్రమే పూర్తయ్యాయన్నారు. సిబ్బంది ప్రణాళిక ప్రకారం పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సీతారామపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్‌లో ఈఎంటిగా మండలంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డుప్రమాదంలో మరణించిన ఓంకారం వెంకటనారాయణ కుటుంబానికి గురువారం నెల్లూరు జిల్లా సిఐటియు 108 ఎంప్లాయిస్ అందరూ కలిసి రూ.90 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుమార్తెలు ఇద్దరికి స్థానిక పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి కుటుంబ సభ్యులకు పాస్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్షుడు మందాటి సురేష్, కార్యదర్శి ఎండోటి నాగరాజు, ట్రెజరర్ పసుపులేటి కిష్టయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఖాన్ సాహెబ్ రబ్బాని, తదితరులు పాల్గొన్నారు.

'ప్రసన్న విమర్శలు అర్థరహితం'

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అర్థరహిత విమర్శలు చేస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రసన్న కుమార్‌రెడ్డి వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని, అలాంటి వారిని రాజకీయాల నుంచి శాశ్వతంగా బహిష్కరించడంతో పాటు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని క్షమాపణలు చెప్పాలని, లేకుంటే భవిష్యత్తులో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

గుంతలమయంగా గ్రామీణ రహదారులు

● ప్రమాదాల బారిన వాహనదారులు



అధ్వానంగా మారిన దక్కనూరు రహదారి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 10 (ఆంధ్రజ్యోతి): గుంతలమయంగా మారిన గ్రామీణ రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, తూర్పుకొండారెడ్డిపల్లి, దక్కనూరు, భోగ్యంవారిపల్లి గ్రామాల రహదారులు గుంతలమయంగా మారాయి. అందులో వర్షపు నీరు నిలవడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియని అయోమయంలో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం ఆగ్రామాల మీదుగా ప్రజలతో పాటు విద్యార్థులు వరికుంటపాడు, వింజమూరు, పామూరు మండలాలకు పరుగులు తీస్తుంటారు. పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రివేళల్లో పరిస్థితి దారుణంగా మారుతోందని, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు



ఆత్మకూరులోని షిరిడీసాయి మందిరంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



సీతారామపురంలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని సాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం ప్రాంగణంలో ఉన్న షిరిడీసాయి మందిరం, మెయిన్ బజార్, మహిమలూరులోని సాయిబాబా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సాయినాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా శివాలయ ప్రధాన అర్చకులు శివయ్యస్వామి గురుపౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం మందిర కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

●**అనంతసాగరం:** మండలంలోని సోమశిల కొండండ రామస్వామి ఆలయ ప్రాంగణంలోని సాయి మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సొట్టు చంద్రమౌళిశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

●**ఉదయగిరి:** పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న గణేశ దత్తసాయి మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా వేద పండితులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి కాగడ, సంధ్యా హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, పల్లకిసేవ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అలాగే మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద ఉన్న సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను ఆలయ ధర్మకర్తలు సుంకర వెంకటాద్రి, సృజన దంపతులు ఘనంగా సన్మానించారు. అనంతరం పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** సీతారామపురం గ్రామ పంచాయతీలోని బాల త్రిపుర సుందరి యోగానంద ఆశ్రమంలో ఆలయ ధర్మకర్త నన్నయబట్టు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సాయిబాబాకు, శ్రీబాల త్రిపుర సుందరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలు



మంత్రి ఆనం పుట్టినరోజు సందర్భంగా ఆత్మకూరులో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు



చేజర్లలో మంత్రి ఆనం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ మండలాధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, నేతలు

ఆత్మకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లోని అర్బన్ ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాలలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇందూరు వెంకట రమణారెడ్డి, టీడీపీ రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచల చౌదరి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ కేతా విజయ భాస్కర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చంద్రా వెంకట సుబ్బానాయుడు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

●**చేజర్ల :** రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన చేజర్లలో టిడిపి మండలాధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా షేక్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సమర్థత గల ఏకైక నాయకుడు ఆనం రాయనారాయణరెడ్డి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు రావి పెంచలరెడ్డి, అన్నలూరు శ్రీనివాసులనాయుడు, తలపనేని జయంతులు నాయుడు, కొమ్మి సిద్దులనాయుడు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆదురుపల్లి గ్రామంలో చీర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, చిత్తలూరు గ్రామంలో మోదేపల్లి పెంచలనాయుడు, చిత్తలూరు యూత్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

●**మర్రిపాడు:** రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మర్రిపాడు మండల కేంద్రంలో టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు దుప్పట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంగాధర్, సీనియర్ నాయకులు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, చిన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రబాబు మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట :** రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను ఏఎస్ పేటలో గురువారం టీడీపీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయబ్ రసూల్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా సెంటర్‌లో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటంరెడ్డి నరసింహరెడ్డి, పులిమి సుధాకర్‌రెడ్డి, మాలాద్రినాయుడు,షేక్ జిలాని బాషా తదిరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు డా ఖాజామియ్య, కంచర్ల శ్రీదర్ నాయుడు, వాకిచర్ల బాబు, శ్రీహరి తదితరులు కెక్ కట్ చేసి సంబరాలు చేశారు. అలాగే అనుమసముద్రం గ్రామంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పులిమి సుదాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్: ఎమ్మెల్యే కాకర్ల



వింజమూరులో మెగా పీటీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కోటవీధి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

వింజమూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డంకాదని, పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు విద్య ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు మంచాల శ్రీనివాసులు నాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు పులిచర్ల నారాయణరెడ్డి, డేగా మధుయాదవ్, జనసేన నాయకులు బండారు సత్యనారాయణ, విద్యార్థులు, తల్లి దండ్రులు, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి :** పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల పట్ల వ్యవహరించాల్సిన తీరుతెన్నులను వివరించారు. స్థానిక ఏఆర్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పీటీఎంలో ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసరావు విద్యార్థుల ప్రగతి, ప్రభుత్వం అందించే పథకాలను తల్లిదండ్రులకు వివరించారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులు తల్లులకు పాదాభి వందనం చేసి మొక్కలు అందజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్లు, సభ్యులు, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల చేయూత

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యాభివృద్ధికి దాతలు తమ వంతు చేయూతను అందజేశారు. గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రూ. లక్ష వ్యయంతో రవాణా సౌకర్యం కల్పించిన అదే గ్రామానికి చెందిన అడుసుమల్లి వెంకటనారాయణను ఘనంగా సన్మానించారు. అలాగే గతేడాది పది ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ. 15వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించిన ఆయనతో పాటు జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూనరావులను సన్మానించారు. వీరితో పాటు నార్త్‌కొండాయపాళెం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యా యుడిగా విధులు నిర్వర్తిస్తున్న వై వెంకటసుబ్బయ్య వాటర్ ప్యూరిఫైర్, కోటాయపల్లి గ్రామానికి చెందిన కుక్కపల్లి మధు ప్రింటర్‌ను అందజేశారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నాదిండ్ల రాజేంద్ర తాగునీటి సరఫరాకు రూ. 20వేలు, స్టడీ ఛైర్స్ కోసం నివేదిత మరో రూ. 10వేలు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, ఉపాధ్యాయులు చలపతి, నాగార్జున, శ్రీహరి, ఎస్ఎంసీ ఛైర్మన్ నాయబ్‌రసూల్, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట :** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వసతులు ఉన్నాయని ఏఎస్ పేట హైస్కూల్ హెచ్ఎం వి రుక్మిణి తెలిపారు. గురువారం ఆమె మెగా పిటిఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక కెజిబీవీలో, ఆదర్శ పాఠశాల, చిరమన, గుంపార్లపాడు, గుడిపాడు తదితర పాఠశాలల్లో పిటిఎం కార్యక్రమం నిర్వహించారు.

●**కలువాయి :** మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం పేరంట్, టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో జరిగాయి. ఎంఈవో శేషగిరిరావు కలువాయిలో పాల్గొని తల్లిదండ్రులకు బహుమతులు పంపిణీ చేశారు. తెలుగురాయపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జీవీ మురళీకృష్ణ, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎం అమృత, నాయకులు ఆర్ నారాయణరెడ్డి, వీ చెంచురెడ్డి, బి నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●మర్రిపాడు : మండలంలోని అన్ని విద్యాలయాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు గురువారం జరిగాయి. పాఠశాలల్లో తల్లిదండ్రులకు టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

●**సీతారామపురం:** మండలంలోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మెగా పేరంట్, టీచర్స్ సమావేశాలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మాజీ జడ్పీటీసీ జ్యోతి, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, ఎంపీటీసీ అల్లూరిరాజు, ఆయకట్టు అధ్యక్షుడు రాజశేఖర్, జనసేన పార్టీ మండల నాయకుడు కాశీరత్తయ్య, మాజీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, మోడల్ స్కూల్ ఛైర్మన్ నాగిశెట్టి అల్లూరయ్య, తిరుపతయ్య, వికాష్‌బాబు పాల్గొన్నారు.

చేజర్ల : మండలంలోని తూర్పుపల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్మి లక్ష్మయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరిక్ష ల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఐఐటిలో సీటు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించడంతో పాటు 25వేల రూపాయలు, ఉపాధ్యాయుడు 10 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మి సిద్దులనాయుడు, పాఠశాల కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గాంధీబొమ్మ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య

● నెల్లూరులో జర్నలిస్టుల ఆందోళన

నెల్లూరు (వైద్యం) జూలై 10 (ఆంధ్రజ్యోతి) : బంగారుపాళెంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడి చేయటం దారుణమంటూ గురువారం సాయంత్రం నెల్లూరులో జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని గాంధీబొమ్మ చుట్టూ తిరుగుతూ జగన్ అనుచరులు ఇలాంటి దాడులకు పాల్పడటం సిగ్గుచేటని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు భవన్ ఇన్‌చార్జి మల్లికార్జునరావు మాట్లాడుతూ జర్నలిస్టులపై ఇలాంటి దాడులు చేయటం హేయమైన చర్య అని, జగన్ గుండాల్లారా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఈ నిరసనలో జర్నలిస్టులు బి.నాగరాజు, మహేష్, ప్రవీణ్, రోహిత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల మందుల టెండర్ రద్దు చేయాలి

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పశువుల మందుల కొనుగోలుకు పాత నిబంధనలతోనే కొత్త టెండరును పిలవాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పశుసంవర్ధక శాఖను కోరారు. నాసిరకం మందులు సరఫరా చేసే కంపెనీలకు అనుకూలంగా కొత్త నిబంధనలు పెట్టి, టెక్నికల్ బిడ్ ఓపెన్‌కు సిద్ధమౌతున్న నేపథ్యంలో ఆ టెండరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.15కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీలను టెండరు ద్వారా పిలవాల్సి ఉండగా.. టర్నోవర్‌ను రూ.12.5కోట్లకు కుదించడం వల్ల మందుల నాణ్యత ప్రశ్నార్థకమౌతుందన్నారు. 2018 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయిలో మందులు కొనే పద్ధతి ఉండగా, ఇప్పుడు జిల్లా పశువైద్యాధికారి మందులు కొనుగోలు చేసే పద్ధతిని ప్రవేశపెట్టడం సరికాదన్నారు.

స్వదేశానికి చేరుకున్న నజీర్

● నరకం నుంచి బయటపడ్డా : నజీర్



చైన్నైలో తండ్రి కాలేషాతో నజీర్

కలువాయి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశంలో చిక్కుకు పోయి అక్కడ 8నెలలుగా యజమాని చేతిలో నరక యాతన అనుభవిస్తున్న నెల్లూరు జిల్లా కలువాయి మండలం కుల్లూరుకు చెందిన షేక్ నజీర్ ఎట్టకేలకు గురువారం రాత్రి స్వదేశానికి చేరుకున్నారు. బుధవారం రాత్రి సౌదీఅరేబియా నుంచి విమానంలో బయలుదేరిన నజీర్ ముందుగా ఢిల్లీకి చేరుకుని అక్కడ నుంచి గురువారం రాత్రి 8గంటలకు చెన్నై విమానాశ్రయానికి వచ్చారు. కొడుకు రాక కోసం ఎదురుచూస్తున్న నజీర్ తండ్రి కాలేషా కొడుకును చూసి బోరున విలపించారు. తండ్రి, కుమారుడు కలసి కుల్లూరులోని ఇంటికి కారులో చైన్నై నుంచి బయలుదేరినట్లు తెలిపారు. చెన్నైలో దిగిన తరువాత ఆంధ్రజ్యోతితో నజీర్ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి, ఏపీ ప్రభుత్వం, సౌదీలోని తెలుగు ప్రవాసీయుల సంఘం సాటా సెంట్రల్ ప్రతినిధులు షేక్ జానీ బాషా, రంజిత్, ముజమ్మిల్, నరేంద్రల సాయంతో నేను ఇండియాకు ప్రాణాలతో వచ్చానని, వారికి నా జీవితాంతం రుణపడి ఉంటానని కన్నీటి పర్యంతం అయ్యారు. 8 నెలలుగా సరిగా తిండి కూడా లేకుండా అక్కడ నేను అనుభవించిన నరకం ఎవ్వరికీ రాకూడదన్నారు. బతుకు తెరువు కోసం 8నెలల క్రితం ఏజెంట్ మాయ మాటలు నమ్మి సౌదీకి వెళ్లి అక్కడ మారుమూల పల్లెలో పశువుల కాపరిగా యజమాని చేతిలో నరకం చూశాడు. ఈ విషయాన్ని నజీర్ తన తండ్రికి వీడియో పంపారు. దీంతో ఆంధ్రజ్యోతిలో నజీర్ కష్టాలపై కథనం ప్రచురితమైంది. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సాటా సెంట్రల్ ప్రతనిధులు ఎంతో శ్రమ పడి నజీర్‌ను క్షేమంగా ఇంటికి చేర్చారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతిచెందిన చుక్కల దుప్పి

ఉదయగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ. అయ్యవారిపల్లి గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో చుక్కల దుప్పి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సమీప అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం గ్రామ శివారులోకి వచ్చిన దుప్పిపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమి దుప్పిని రక్షించారు. అయినా దుప్పి తీవ్రంగా గాయపడడంతో మృతిచెందింది. గ్రామస్థులు ఎస్ఐ శ్రీనుకు సమాచారం అందించడంతో ఆయన రేంజ్ అధికారి కుమారరాజాకు తెలియజేశారు. రేంజర్ ఆదేశాల మేరకు కొత్తపల్లి ఇన్‌చార్జి ఎఫ్‌బీవో గౌతమ్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని మృతిచెందిన దుప్పిని ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. శుక్రవారం దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి రిజర్వు ఫారెస్టులో దహనం చేయనున్నట్లు వారు తెలిపారు.

కులంపేరుతో దూషించారని ఫిర్యాదు

కొండాపురం, జూలై10(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించారని మండలంలోని పార్లపల్లికి చెందిన ఆశా వర్కర్ గుంటగాని మేరీ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు, గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పీటీఎంకి మెడికల్ డ్యూటీకి మేరీ వెళ్లింది. మేరీ కోడలు గుంటగాని సుష్మిత అదే పాఠశాల విద్యాకమిటీ ఛైరపర్సన్‌గా ఉండగా, కొద్ది రోజులక్రితం మధ్యాహ్న భోజనం వండే గడ్డం ప్రభావతిని వంటలు సరిగా చేయలేదని ప్రశ్నించింది. దీంతో కక్ష కట్టి పాఠశాలలో తమ కాలనీకి చెందిన వారితో మాట్లాడుతుండగా ప్రభావతి, కుటుంబసభ్యులు నన్ను, నా కోడలిని కులం పేరుతో దూషించిందని మేరీ ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతటితో ఆగక చేతులతో కొట్టి కిందపడేసిం దన్నారు. ఈ విషయమై విచారించి న్యాయం చేయాలని ఆమె పోలీసులను కోరారు.

గాంధీ జనసంఘంలో బాలిక మృతి

కోవూరు, జూలై10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవూరు చెరువు కట్ట పక్కన ఉన్న గాంధీ జనసంఘంలో ఓ బాలిక గురువారం ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. బాలిక మృతి విషయమై కోవూరు పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	121
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 540

ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు

లింగసముద్రం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని మండల ఏపీవో షేక్ సమీర్‌బాషా తెలిపారు.గురువారం లింగసముద్రం లోని వాకమళ్లవారిపాలెంలో పంట కాలువల పూడికతీతను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బోగస్ మస్టర్ల కారణంగా పని చేసినవారికి తక్కువ డబ్బులు వస్తాయని ఆయన తెలిపారు.ఈ విషయాన్ని శ్రామికులు గమనించాలని చెప్పారు.ఒకరి బదులు మరొకరు పనులకు రావద్దని చెప్పారు.శ్రామికులు ఉదయం 6 గంటలకే పనులకు వచ్చి 10 గంటల వరకు పనిచేసి వెళ్లాలన్నారు.


శ్రామికుల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీవో సమీర్‌బాష


న్యూస్ బాక్స్

అగ్రికల్చరల్ అసిస్టెంట్‌కు సన్మానం


నాగరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు మోహన్‌కుమార్

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకభూపాలపురం సచివాలయంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కనిగిరి సచివాలయానికి బదిలీ అయిన నాగరాజుకు ఆ గ్రామ టీడీపీ నాయకులు ప్రగడ మోహన్‌కుమార్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రగడ బలరామయ్య, చెంచు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహకాలు


సాగులో ఉన్న నిమ్మ

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకానికి కూటమి ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు ప్రకటించింది. మండలంలోని చుండి, అయ్యవారిపల్లె, పోలినేనిచెరువు, గరుకుపాలెం, వీరన్నపాలెం, పెదఅమ్మపాలెం, కాకర్లపాలెం, వలేటివారిపాలెం, అంకభూపాలపురం, రామచంద్రాపురం, గ్రామాల్లోని మెట్ట భూముల్లో పండ్లతోటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం రాయతీలు ప్రకటించడంతో మళ్లీ పండ్ల తోటల సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిమ్మ, జామ, మామిడి, డ్రాగన్ తదితర పండ్ల తోటలతో పాటు పూలతోటలు సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వీటి సాగుపై ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, వన్‌బీ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, సన్నచిన్నకారురైతు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఉపాధి హామీ ఏపీవో దయాసాగర్ తెలిపారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

అల్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కావలిలో శుక్రవారం నిర్వహించనున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్రాంత న్యాయాధికారి శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆధ్వర్యంలో చేపట్టే ఈ అదాలత్‌లో వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కావలి విద్యుత్ ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

త్వరలో పాలిటెక్నిక్‌కు స్పాట్ అడ్మిషన్లు

కావలి రూరల్, జూలై10(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లో చేరేవారికి త్వరలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కావలి మండలం రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా తొలిదశ అడ్మిషన్ల పూర్తయ్యాయని, సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న 61 సీట్లకు, ఎలక్ట్రికల్‌లో ఖాళీగా ఉన్న 49 సీట్ల కు రెండవదశ అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తులు ప్రిన్సిపాల్ రూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి సమాచారం కోసం 94403 94524, 79813 07400, 99129 83434, 73822 19762, 93980 95597 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

కొండాపురం, జూలై10(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఆరోగ్య, విద్య, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పారిశుధ్యం, పశుసంవర్ధకశాఖ, ఇరిగేషన్, హౌసింగ్ తదితర అంశాలపై గత మూడునెలల కాలంలో జరిగిన అభివృద్ధి పనులపై ఎంపీడీవో ఆదినారాయణరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలుశాఖల అధికారులు, పంచాయతీకార్యదర్శులు, ఎమ్‌పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ అనూరాధ

విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు తల్లితండ్రులు, ఉపాధ్యాయులే!




కావలి : కేజీబీవీ పాఠశాలలో తల్లితండ్రులకు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి, కలిగిరి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, పాలూరు దొండపాడు పాఠశాలలో జరిగిన సరస్వతీపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు శ్రీపూజ

పీటీఎంలో వక్తలు
స్కూళ్ల అభివృద్ధిపై చర్చ
తల్లిదండ్రులకు క్రీడా పోటీలు

కావలి/కావలి(టౌన్), జూలై10(ఆంధ్రజ్యోతి) విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు తల్లితండ్రులు ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. పీటీఎంను గురువారం ముసునూరులోని కేజీబీవీ ఉన్నత పాఠశాల, కావలి రూరల్ మండలం రుద్రకోటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం తల్లితండ్రులకు మొక్కలు పంపిణీ చేసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కేజీబీవీ పాఠశాలలో నీటిసౌకర్యంలేదని తల్లితండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తేగా వెంటనే సొంత నిధులతో బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. రుద్రకోట పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు పడతున్నా మని చెప్పగా, వాటర్‌ప్లాంట్ కోసం రూ.35వేలు అందచేస్తానని చెప్పారు. కార్యక్రమాలలో డిప్యూటీ డీఈవో హరిప్రసాద్, ఎంఈవో-2 వెంక టసుబ్బయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, రుద్రకోట ఎస్ఎంసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, ప్ర దానోపాధ్యాయుడు చాగంటి మురళి, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మధుబాబునా యుడు, జ్యోతి బాబురావు, బీమా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

● కావలి జడ్పీ పాఠశాల ప్రాంగణంలోని భవిత సెంటర్‌లోని విద్యార్థి మనోహర్ పదిలో ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలవడంతో డిప్యూటీ డీఈవో హరిప్రసాద్ చేతుల మీదుగా మెరిట్ స్కాలర్‌షిప్ అందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య, జేవీవీ బాధ్యులు హరనాథ్ సుబ్బరామశర్మ, పీడీ చిరంజీవి, రమణయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● **కలిగిరి :** పిల్లల భవిష్యత్ లో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూ డా భాగస్వాములేనని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. స్థానిక ఏపీమోడల్ స్కూల్‌లో గు రువారం పీటీఎంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి తమ పిల్లల చదువు, క్రమశిక్షణ తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించాలని పే ర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఏ శ్రీను, అధ్యాపక సిబ్బంది టీడీపీ, జనసేన నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు, కాగా కలిగిరి మండలంలోని తూర్పుమాలపాలెం ప్రాథమిక పాఠశాలలో జైగౌడ ఉద్యమం ని యోజకవర్గ అధ్యక్షుడు పంది మాల్యాద్రి గురు వారం సుమారు 40మంది విద్యార్థులకు అవస రమైన పలకలు, నోటుపుస్తకాలు, పెన్సిల్, పె న్నులను అందజేశారు. పీటీఎంను పురస్క రించుకొని వీటిని అందచేశారు. అనంతరం తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యుడు మహేష్, మాల్యాద్రి మిత్ర బృందం, పొన్నం చిన్నా, ఎస్‌కే జిలాని తదిత రులు పాల్గొన్నారు.

● **కందుకూరు :** మెగా పీ టీఎంను గురు వారం కందుకూరు పట్టణం, రూ రల్ మండలాల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించారు. మండలంలోని పాలూరు దొండపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు శ్రీపూజలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూజలు చేసి, తల్లిదండ్రులు, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అకడమిక్స్‌లో, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తల్లికివందనం పథకం కింద ఐదుగురు పిల్లల తల్లి ఉమామహేశ్వరికి రూ. 65వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అదనపు తరగతి గదికి ఉలవపాడుకు చెందిన ఎన్నారై భోగినేని చెంచురామానాయుడు ఆర్థికసహాయం ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లావణ్య, డిప్యూటీ డీఈవో నరసింహారావు, ఎంఈవోలు అజయ్‌బాబు, సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, కంద్రా మా ల్యాద్రి, తల్లపనేని రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.


అల్లూరు : విజ్ఞాన జ్ఞాపికను అందుకుంటున్న బీద గిరిధర్ తదితరులు

●**కొండాపురం :** మండలం లోని ప్రభుత్వ, ప్రైవేటు, జూనియర్ కళాశాలల్లో గురువారం పీటీఎం 2.0ను నిర్వహించారు. ఎంఈవోలు కే. రవికుమార్, ఆనందరావు పా ల్గొన్నారు. మొక్కలు పంపిణీచేసి వాటిని నాటి సంరక్షించుకోవాల్సిందిగా ఉపాధ్యాయులు సూ చించారు. ఈ కార్యక్రమాలలో ప్రధానోపాధ్యా యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **అల్లూరు :** పిల్లల క్రమశి క్షణలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కె రీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎ.మధు అన్నారు. పీటీఎంలో భాగంగా ఇస్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ యన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సోమ శిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిదర్, సర్పంచి పాటి రంజిత్, పాఠశాల కమిటీ చై ర్మన్ బుచ్చింగారి బాబు, మాజీ ఎంపీటీసీ గం గపట్నం శీనయ్య, నాయకులు దానం రజిని, హెడ్‌మాస్టర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నా రు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపా ధ్యక్షుడు బీద గిరిదర్ అన్నారు. పట్టణ ప రిధిలోని ఆర్‌డీఆర్ కాలనీలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన పీటీఎం లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య, దయాకర్, ఇస్మాయిల్, నజీర్‌బాషా, రాజశేఖర్‌బాబు, ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం :** పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తలిదండ్రులు కృషి చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథ మికోన్నత, ఉన్నత పాఠశాలలు, ప్రైవే టు పాఠశాలల్లో పీటీఎం నిర్వ హించారు.మండలంలోని పెంట్రాల, వాకమళ్లవారిపాలెం, వెంగళాపురం పాఠశాలల్లో జరిగిన పీటీఎంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ పాల్గొన్నారు. అంగి రేకులపాడు హెచ్‌పీ పాఠశాలలకు మాజీ సర్పంచు టీడీపీ నాయకుడు ముప్పరాజు వెంకటేశ్వర్లు రూ.2 వేలు విరాళం అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

● **ఉలవపాడు :** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం మెగా పీటీఎం ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. ఆయా పాఠ శాలల విద్యా కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలు నిండిపోయాయి. తల్లిదండ్రులకు టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు.

● **వలేటివారిపాలెం :** విద్యాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికష్ణ తెలిపారు. మండలంలోని వలేటివారిపాలెం, పోకూరు, నలదలపూరు, శాఖవరం, అయ్యవారిపల్లె, చుండి మోడల్‌స్కూల్, కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మెగా పీటీఎం పండుగలా జరిగింది.

వాడవాడలా వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

భక్తులతో కిక్కిరిసిన సాయిబాబా మందిరాలు ● ప్రత్యేక పూజలు

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : గురుపూర్ణిమను పురస్కరించుకుని గురువారం మండలంలో వే డుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరు పే టలోని షిరిడి సాయినాథుడి ఆలయం, దత్తసా యి మందిరం, కలుగోళమ్మ ఆలయం వద్ద సాయి ఆలయం, తూర్పువీధిలోని సాయినాథుడి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఉద యం నుంచి అభిషేకాలు, లక్ష మల్లెలపూజను నిర్వహించారు.

● **లింగసముద్రం :** మండ లంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం వైభ వంగా జరిగాయి. చినపవని, పెదపవని తది తర గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో పం డుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. చి నపవని సాయిబాబా ఆలయంలో భక్తులు సా యిబాబా విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలం కరించారు.ఈ సందర్భంగా గ్రామస్థుల సహకా రంతో అన్నదానం నిర్వహించారు.


కలిగిరి : సాయినాథుడి పూజలో భక్తులు

● **కావలి :** ప్రతిఒక్క రూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం తో ఉంటారని యోగా గురువులు గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సావిత్రి తెలిపారు. పట్టణంలోని కొ త్తబజారు కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం యో గా కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా యోగా గురువులు యోగా ఆవశ్యకతను గు రించి వివరించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ మన నిత్య జీవితంలో ఒక సాధనంగా యోగాను ప్రతి ఒక్కరూ అలవ ర్చుకోవాలన్నారు. అనంతరం దేవస్థానకమిటీ వారు ఎమ్మెల్యేను సత్కరించారు.

● **కలిగిరి :** స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

● **కావలి(టౌన్) :** గురుపూర్ణిమ గురువారం పట్టణంలో వైభవంగా జరిగింది. ముసునూరు శ్రీసాయి క్షేత్రంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టేపాలెం నాగేశ్వరరావు పర్యవేక్షణలో పూజా కార్యక్ర మాలు జరిగాయి.అనంతరం ప్రాంగణంలోని వరసిద్ధి గణపతి స్వామి, సుబ్రమణ్యస్వామి, ఆంజనేయస్వాములకు చందనాలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. పేదలకు వస్త్రాలు అం దచేశారు. విజయగణపతి భజన సమాజం వారి బాబా నామ సం కీర్తన, భజన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసం తర్పణ చేశారు. అటవీ కార్యాలయం వీధిలోని బాబా మంది రంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు టంగుటూరు ప్రసాద్, పోతుగంటి అలేఖ్య సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

● **కందుకూరు :** గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న సాయిబాబా ఆ లయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటుచేశారు. ప్రత్యేక పూజలకు ఎమ్మెల్యే ఇం టూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. మండలంలోని మోపాడు వద్ద ఉన్న సాయి మందిరం లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కావలి : బాబా సేవలో మహిళా సేవకులు

● **బిట్రగుంట :** బోగోలు మండలంలోని షిరిడీసాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. బోగోలు, విశ్వనాథరావుపేట, పాతబిట్రగుంట, కడనూతల, బిట్రగుంట ద్వారకానగరులోని సాయిబాబా మందిరాల్లో అన్నసంతర్పణ నిర్వహించారు.


లింగసముద్రం : చినపవనిలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా విగ్రహం


అల్లూరు : సాయినాథుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

మందుబాబులకు అడ్డాగా పశువైద్యశాల ఆవరణ

● ఇబ్బందులు పడుతున్న పశువైద్యులు, సిబ్బంది

వలేటివారిపారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు పశువైద్యశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. పశువైద్యులు, సిబ్బంది వైద్యశాల నుంచి ఇళ్లకు వెళ్లాక మందుబాబులు రాత్రివేళల్లో అక్కడ మద్యం సేవిస్తున్నారు. అంతే కాక మద్యం సీసాలు, సిగిరెట్లు, గుట్కాలు, బిర్యానీ ప్యాకెట్లు అక్కడే పడేస్తున్నారు. దీంతో పశువైద్యశాల భవనం ముందు అపరిశుభ్రత ఏర్పడుతుంది. పశువైద్యశాల బస్టాండు సెంటరులోనే ఉండడంతో మందుబాబులకు మద్యం తాగేందుకు అనువుగా ఉంది. దీంతో పశువైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలి.


పశువైద్యశాల ఆవరణలో లోపించిన పారిశుధ్యం

ఆదిమూర్తిపురంలో ఇసుక డంప్

కొండాపురం, జూలై10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిమూర్తిపురంలో వైసీపీ నేత నల్లమోతు తిరుపతిస్వామి పెద్దఎత్తున ఇసుకను డంప్ చేశారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ కోటేశ్వరావు పోలీసులతో కలసి గురువారం గ్రామంలో పరిశీలనకు వెళ్లారు. ఇంతమొత్తంలో ఇసుకను ఎందుకు డంప్ చేశావని ఆయన్ను ప్రశ్నించగా, నూతనంగా ఇంటిని నిర్మించుకునేందుకు తెచ్చుకున్నానని చెప్పారు. ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఏసమయంలోనైనా సరిపడినంత ఇసుకను తెచ్చుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంటే ఈవిధంగా డంప్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. డంప్ చేసిన ఇసుక సుమారు 110 ట్రాక్టరు ట్రక్కులు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. అక్రమంగా అమ్ముకునేందుకు ఇసుకను డంప్ చేశాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విచారించి కేసు నమోదు చేయవలసినదిగా పోలీసులను ఆయన ఆదేశించారు.


ఇసుక డంప్ చేసిన వ్యక్తితో మాట్లాడుతున్న తహసీల్దార్ కోటేశ్వరరావు, పోలీసులు

విశిష్ట వ్యక్తులకు సన్మానం

కందుకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విశిష్ట వ్యక్తులకు సన్మానం నిర్వహించారు. ఉపాధ్యాయులుగా, సంఘ్ సేవకులుగా, బీజేపీ నాయకత్వ బాధ్యతల్లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న పలువురిని పట్టణ బీజేపీ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు ఆధ్వర్యంలో సత్కరించారు. సన్మానం అందుకున్న వారిలో మువ్వల భూషయ్య, బుర్రా కోటేశ్వరరావు, పల్లపోతు లక్ష్మీనారాయణ, కవర్తపు మల్లికార్జున, తానికొండ కోటయ్య, వాకాని శేషాచార్యులు ఉన్నఆరు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవులు, వైకుంఠం, సురేష్, చుండి మురళీధర్, పొణ్యం గాంధీ, పాలూరు మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గురుపూజోత్సవం సందర్భంగా విశిష్ట వ్యక్తులను సత్కరించిన బీజేపీ నాయకులు

నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా చిలకపాటి



బిట్రగుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా చిలకపాటి వెంకటేశ్వర్లును గురువారం ఎంపిక చేశారు. త్రీమెన్ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన తీర్మాన మినిట్‌బుక్‌లో సంతకాల అనంతరం చిలకపాటి, ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. త్రీమెన్ కమిటీలో వాయిల సుధా, లక్కాకుల మాధవరావులను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.

మూడు జోన్లుగా స్ట్రీట్ వెండర్స్

కావలి,జూలై10(ఆంధ్రజ్యోతి) పట్టణ పరిధిలో ఉన్న స్ట్రీట్ వెండర్స్‌ను మూడు జోన్లుగా విభజించినట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. కమిషనర్ చాంబరులో గురువారం సాయంత్రం స్ట్రీట్‌వెండింగ్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్ట్రీట్ వెండర్లను గ్రీన్‌జోన్, రెడ్‌జోన్, ఆరంజిజోన్‌లుగా మూడు కేటగిరీలుగా విభజించి స్ట్రీట్ వెండర్స్‌కు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ ప్రణాళికాధికారి వివేకానంద్ పాల్గొన్నారు.

కరేడు రైతులకు అన్యాయం

కందుకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కలిసి కరేడు రైతులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కరేడు రైతుల కన్నీటి గాథ చూస్తుంటే బాధ కలుగుతోందని, ఈ ఉపద్రవం నుంచి బయట పడాలంటే పార్టీలు ఆడే ఆటలో పావులు కాకుండా రైతులు తమ ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈఈ తాటికొండ మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లను తొలగించే క్రమంలో సరఫరా నిలిపివేస్తునట్లు తెలిపారు.

సుపరిపాలనలో తొలిఅడుగు

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు, చుండి, వీరన్నపాలెం, వలేటివారిపాలెం, అంకభూపాలపురం తదితర గ్రామాల్లో గురువారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం, వలేటి మధుసూదన్ రావు, వీరమోసు అంజయ్య, చొప్పర రాఘవులు, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీలో టీడీపీ నాయకులు

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, పేదప్రజల సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పాలూరు దొండపాడులో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రభుత్వ ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, నూరె వినోద్‌కుమార్‌రెడ్డి, కంద్రా మాల్యాద్రి, తల్లపనేని రవీంద్ర, బుస్సారెడ్డి వెంకటేశ్వరరెడ్డి,ఆళ్ల హరికృష్ణారెడ్డి, రామాల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. కందుకూరులోని పలు వార్డుల్లోనూ గురువారం స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ వాయిదా

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ జహీర్ అవినీతిపై విచారణ చేయాలని కలెక్టర్ గ్రీవెన్స్‌లో మాజీ ఉప సర్పంచు వీరరఘు కోరారు. ఈ క్రమంలో గురువారం విచారణ జరపాల్సి ఉండగా వాయిదా పడినట్లు డీఎల్పీవో వెంకటరమణ తెలిపారు.

అర్హుల జాబితా ప్రకటన

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన అర్హుల జాబితాలు ప్రతి రైతుసేవా కేంద్రంలో ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 11 జూలై 2025



గురుపౌర్ణమి గరుడసేవ

గురుపౌర్ణమి సందర్భంగా తిరుమలలో గురువారం రాత్రి గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. ఆహ్లాదకర వాతావరణంలో తన ఇష్టవాహనమైన గరుడుడిపై సర్వాలంకార భూషితుడై మలయప్ప స్వామి నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవిందనామ స్మరణల మధ్య గరుడుడిపై గోవిందుడు భక్తులను కటాక్షించారు. గురుపౌర్ణమి కావడంతో తిరుమల, తిరుపతి స్థానికులతో పాటు భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరి కర్పూర నీరాజనాలతో మలయప్పస్వామిని దర్శించుకున్నారు. వాహనసేవలో కేంద్రమంత్రి బండి సంజయ్, జీయర్‌స్వాములు, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అదనపుఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి

నిరసన గళం



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో బుధవారం వైసీపీ అధినేత జగన్ పర్యటన సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరు శివకుమార్‌పై ఆ పార్టీ మూకల దాడిని ఖండిస్తూ గురువారం తిరుపతిలో నిరసన గళం వినిపించారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. – 6లో



ఉత్సాహంగా పాల్గొన్న తల్లిదండ్రులు

3,198 పాఠశాలలు, కళాశాలల్లో సమావేశాలు

తల్లులకు వందనం.. వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురంలో తల్లుల కాళ్లు మొక్కుతున్న పిల్లలు

కోలాహలంగా మెగా పీటీఎం 2.0

తిరుపతి(విద్య), జూలై 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సంబంధాలను బలపరిచి.. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం శుక్రవారం జిల్లాలోని పాఠశాలల్లో కోలాహలంగా జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సారి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోనూ సమావేశాలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారుల ఆధ్వర్యంలో విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ కమిటీలు పీటీఎం కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో.. తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులు, తల్లిదండ్రులు, పిల్లలతో మొక్కలు నాటించి పర్యావరణ పరిరక్షణ తెలియజేశారు. ఇంకా ఫొటో డ్రీమ్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లను నిర్వహించారు. విద్యార్థులు ఇళ్లలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలు సెల్‌ఫోన్ల వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు, తద్వారా మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. చివరిగా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు చూపించారు. ఏయే పాఠ్యాంశాల్లో.. ఏ స్థాయిలో ఉన్నారో చెబుతూ ఇంటివద్ద చదివించేటప్పుడు దృష్టిపెట్టాల్సిన అంశాలను విశదీకరించారు. ఇలా తల్లిదండ్రులు తమ విద్యార్థుల విద్యాసంస్థలకు వచ్చి.. ఆటపాటలతో సందడిచేసి.. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొని.. తమ పిల్లల ప్రగతి నివేదికలు తెలుసుకుని... వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన పెంచుకుని తిరిగివెళ్లారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,198 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్ 2.0 జరిగింది. ఈ విద్యాసంస్థల్లో మొత్తం 3,47,565 మంది విద్యార్థులు ఉన్నారని, వారితోపాటు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమాల్లో అత్యధిక శాతం పాల్గొన్నారని అధికారులు వెల్లడించారు. తమ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించండి: కలెక్టర్

వెంకటగిరి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాన్ని.. వారు ఏ రంగంలో రాణించగలరో గుర్తించి అందుకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. వెంకటగిరిలోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ తులసీజ్యోతి ఆధ్వర్యంలో గురువారం జరిగిన పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బట్టీపట్టే విధానం నుంచి గుణాత్మక విద్య వైపు మళ్లేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం నాణ్యమైన యూనిఫాం, షూ, బ్యాగ్, సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందిస్తోందన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. తల్లిదండ్రులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. ఈ సమావేశంలో ఎంపీపీ తనూజా, డీఈవో కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీఐ రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

మంత్రి పీఏ చెప్పారు కదా..
షాపు ఇచ్చేయండి

- ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వైద్యాధికారిణిపై గుంటూరు వ్యక్తి ఒత్తిడి
- ఇప్పటికే రుయాలో అరకు కాఫీ షాపునకు లైసెన్స్

'మంత్రి పీఏ చెప్పారు కదా.. ఇక్కడ కూడా షాపు ఇవ్వండి.. లేదంటే నేను సీఎం పీఏగా వెళ్లే అవకాశం ఉంది.అప్పుడు నా అవసరం ఉంటుంది' అంటూ గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి కొన్ని రోజులుగా ఓ మహిళా వైద్యాధికారిణిపై ఒత్తిడి చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల పీఏలతో సత్సంబంధాలు పెట్టుకుని వారితో ఫోన్లు చేయించి పనులు చేసుకోవడంలో దిట్టగా పేరున్న సదరు వ్యక్తి తిరుపతి ఎస్వీఆర్ రుయా ఆస్పత్రిలో నామమాత్రపు అద్దెతో అధికార యంత్రాంగం ద్వారా 'అరకు కాఫీ' షాపు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే వరసతో పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఎదుట కూడా అరకు కాఫీ షాపు పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కాఫీ షాపునకు అనుమతి ఇవ్వాలని ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఓ మంత్రి పీఏతో ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేయించినట్టు తెలిసింది. ఇటీవల వైజాగ్ నుంచి ప్రసూతి ఆస్పత్రికి బదిలీపై వచ్చిన మహిళా వైద్యాధికారిణికి వచ్చీరాగానే ఈ వ్యవహారం ఎదురు కావడంతో ఆమె ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఒకే ప్రాంగణంలో రెండు షాపులు ఎందుకన్నట్టుగా ఆయన చెప్పినట్టుగా తెలిసింది.

అరకుకు పెరుగుతున్న గిరాకీ : ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు సహజ పద్ధతుల్లో సాగుచేసే అరకు కాఫీ ఖ్యాతి ఖండాంతరాలను దాటేసింది. ఈ క్రమంలో తిరుపతిలోనూ అరకు కాఫీ షాపులు వెలుస్తున్నాయి.ఆదివాసీల పేరుతో లైసెన్సులు తీసుకుని ఇతర వ్యక్తులు ఈ వ్యాపారంలోకి దిగుతున్నారు. అరకు పేరు వాడుకుని ప్రభుత్వం నుంచి రాయితీలు పొంది దర్జాగా వ్యాపారాలు చేసుకునేందుకు బడా వ్యక్తులు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఈ షాపుల కోసం పెద్ద యెత్తున దరఖాస్తులు వస్తున్నాయి.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి



చీరపై నేచి 'లక్ష్మీ వృక్షం' డిజైన్

చేనేతే జీవితంగా..!

వెంకటగిరి నేతన్న శ్రీనివాసులుకు రెండోసారి సంత్ కబీర్ అవార్డు

వెంకటగిరి, జులై 10 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే చేనేతపై దృష్టి పెట్టారు. ఇందులో నైపుణ్యం సాధించి.. రాణిస్తూనే ఐటీఐ మెకానికల్ డ్రాఫ్ట్స్‌మేన్ కోర్సు పూర్తి చేశారు. శ్రీహరికోటలో ఓ ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత పూర్తి సమయాన్ని చేనేత పనికే కేటాయించారు. చీరలపై జాందాని వర్కు చేయడంలో ప్రావీణ్యం సాధించారు. ఇలా చేనేతనే జీవితంగా మార్చుకుని.. పూర్తి సమయం కేటాయించారు వెంకటగిరికి చెందిన నేతన్న లక్కా శ్రీనివాసులు. అందుకే ఇప్పుడు రెండోసారి ఆయన సంత్ కబీర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. 'దేశంలో ఎక్కడాలేని జాందాని పనిపై దృష్టి సారించా. ఆపోజిట్ ఎగస్ట్రావర్స్ ఇంటర్‌లాక్ సిస్టం విధానాన్ని మగ్గంపై ఉంచి చీరల్లపై అద్భుతమైన డిజైన్లు సృష్టించా. 2013లో గోకుల బృందావనం అనే వాల్ హ్యాంగింగ్ నేయగా.. అది జాతీయ అవార్డుకు ఎంపికైంది. 2015లో ఈ అవార్డును ప్రధాని చేతుల మీదుగా అందుకున్నా. భగవద్గీత శ్లోకాలను చీరపై నేసి ఇస్కాన్ టెంపుల్‌కు అందించా. గతంలో చీర నేసేది ఒకరు.. అవార్డు పొందేది మరొకరుగా ఉండేది. ఆ విధానంపై నేను అప్పటి కేంద్ర మంత్రి ఎం.వెంకయ్య నాయుడు దృష్టికి తీసుకెళ్లి అర్హులకే అవార్డు అందేలా పరీక్షా విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చాం. ఇప్పుడు అవార్డుకు ఎంపికైన 'లక్ష్మీ వృక్షం' చీర తయారు చేయడానికి నాలుగు నెలల సమయం పట్టింది. దీంతో పాటు మరో రెండు చీరలు పంపినా, అవి అర్హత సాధించలేదు' అని లక్కా శ్రీనివాసులు వివరించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఇలాంటి అద్భుతాలు మరెన్నో చేసి చూపుతామన్నారు.



శ్రీనివాసులును సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల

'లక్కా'కు సన్మానం

వెంకటగిరి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'సంత్ కబీర్' జాతీయ అవార్డుకు ఎంపికైన వెంకటగిరి బొప్పాపురం సాలికాలనీకి చెందిన లక్కా శ్రీనివాసులును గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సన్మానించారు. సంత్ కబీర్ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. వెంకటగిరి చీరలకు ప్రపంచ ఖ్యాతి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర్, పోలంరెడ్డి వెంకటరెడ్డి, అవ్వారు శ్రీనివాసులు, చంద్రమౌళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి- విద్యా కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వృత్తి-విద్యా కోర్సులకు షెడ్యూల్ కులాల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద శాతం శిక్షణ, ఉపాధి, ఉచిత భోజనం.. వసతితో 38 రోజుల శిక్షణకు 10వ తరగతి విద్యార్హతగా పేర్కొన్నారు. 15 నుంచి 45సంవత్సరాల వరకు వయోపరిమితి, చివర్లో సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. ఈనెల 14వరకు దరఖాస్తులకు గడువు ఉందని తెలిపారు. ఆసక్తిగల షెడ్యూల్డ్ కులాల యువతీ, యువకులు పేర్ల నమోదుకు, మరిన్ని వివరాల కోసం 79811 55147, 97014 40274, 97034 37472 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

స్విమ్స్‌లో యూజీ కోర్సులకు నోటిఫికేషన్

తిరుపతి(వైద్యం), జూలై 10(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పలు యూజీ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ 110 సీట్లు, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ) 55 సీట్లు, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్ పారామెడికల్(86) సీట్లు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వీటికి ఇంటర్ బైపీసీతో సమానమైన అర్హత, ఏపీఈఏపీసీఈటీ ర్యాంకులో మెరిట్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామన్నారు. వీటికి సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా లేదా స్విమ్స్ వెబ్‌సైట్ నుంచి పొందాలని సూచించారు.



కేంద్ర బృందంచే చెత్త నిర్వహణ ప్లాంట్ల పరిశీలన

తిరుపతి, జూలై10(ఆంధ్రజ్యోతి): తిరుపతికార్పొరేషన్ నిర్వహిస్తున్న తూకివాకం, రామాపురం చెత్త నిర్వహణ ప్లాంట్లను కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి (అమృత్ పథకం) ఇషా కాలియా, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్ గురువారం కమిషనర్ మౌర్య తదితరులతో కలిసి పరిశీలించారు. మురుగునీటిని శుద్ధి చేసి ప్రైవేటు ఫ్యాక్టరీలకు, పంటలకు సరఫరా చేస్తున్నామని.. రామాపురంలో ఎరువునుపొలాలకు, ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తామని కమిషనరు వివరించారు.

నలుగురు నకిలీ విజిలెన్స్ అధికారుల అరెస్టు

- డమ్మీ తుపాకీ, రూ.1.26 లక్షల స్వాధీనం

రేణిగుంట, జులై 10 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులమంటూ వడమాలపేట మండలం ఎస్.వి.పురం వీఆర్వో భూపతిని బురిడీ కొట్టించి రూ.1.5 లక్షలు కాజేసిన నలుగురిని అరెస్టు చేసినట్లు గాజులమండ్యం సీఐ మంజునాథ రెడ్డి గురువారం తెలిపారు. రేణిగుంట మండలం తిమ్మయ్యపల్లికి చెందిన కృష్ణంరాజు ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ముఠాగా ఏర్పడ్డారు. ఈక్రమంలో గత నెల 28న ఉదయం రేణిగుంట మండలం జీవాగ్రంలోని వీఆర్వో భూపతి ఇంటికి ఏలూరుకి చెందిన కాశీవిశ్వేశ్వరయ్య, తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన సంతోష్, శంషుద్దీన్, తిరుపతికి చెందిన నరేంద్ర విజిలెన్స్ అధికారులమంటూ వచ్చారు. ఆయనపై ఫిర్యాదులు వచ్చాయంటూ బెదిరించడంతో, ఆందోళన చెందిన భూపతి రూ.1.5 లక్షలు ఇచ్చారు. మిగిలిన మొత్తాన్ని సర్దుబాటు చెయ్యాలని బెదిరించి వెళ్లారు. వారం తర్వాత పదే పదే డబ్బుల కోసం ఫోను చేయడంతో ఆయన గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం డబ్బు కోసం భూపతికి నకిలీ అధికారులు ఫోన్ చేశారు. పోలీసులు సూచించిన ప్రకారం తూకివాకం జంక్షన్‌కు వచ్చి డబ్బు తీసుకోవాల్సిందిగా భూపతి వారికి చెప్పాడు. అక్కడికి చేరుకున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో ఈ ముఠాకు కీలకమైన నిందితుడిని నరేంద్రను తిరుపతిలో అరెస్ట్ చేశారు. వీరి నుంచి డమ్మీ తుపాకీ, 5 సెల్ ఫోన్లు, రూ.1.26 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.



తిరుమలలో శివమణి

తిరుమల శ్రీవారిని గురువారం ప్రసిద్ధ డ్రమ్స్ వాయిద్య కళాకారుడు శివమణి దర్శించుకున్నారు. ఇంకా సీనియర్ ఐపీఎస్ అధికారి ఐజీ శ్రీకాంత్ కూడా స్వామి దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వరకట్న వేధింపులకు వివాహిత బలి

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేకు గంధవల్లి సుజాత(32) అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు... సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారికండ్రిగకు చెందిన గంధవల్లి సుజాతకు తమిళనాడుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుని నాదెండ్లవారికండ్రిగలోని అమ్మగారి ఇంట్లో ఉంటోంది. ఈ ఏడాది జనవరి 31న నాయుడుపేటకు చెందిన తన మేనత్త కుమారుడు రాజేంద్రను కుటుంబ సభ్యుల అంగీకారంతో వివాహం చేసుకుంది. ఇటీవల భర్తతో



సుజాత (ఫైల్ ఫొటో)

పాటు అత్త, ఆడబిడ్డ వరకట్నం తేవాలంటూ సుజాతను వేధించారు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత నెలక్రితం అమ్మగారి ఇంటికి చేరుకుంది. గురువారం తన తమ్ముడికి ఫోన్ చేసి మీరు కట్నం ఇవ్వరు.. నా జీవితం ఎందుకు ఇంక.. నేను చనిపోతున్నా అని చెప్పింది. కంగారుపడిన అతడు తన తండ్రి రవికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి ఇంటికి చేరుకునే లోపే సుజాత ఉరి వేసుకుని మృతి చెందింది. భర్త రాజేంద్ర, అత్త, ఆడబిడ్డలే తన చావుకు కారణమంటూ సుజాత రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూళ్లూరుపేటకు చేరుకుని మృతురాలు కుటుంబ సభ్యులతో పాటు, భర్త రాజేంద్ర, అత్త, ఆడబిడ్డలను విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,501

తలనీలాలు సమర్పించినవారు: 29,033



పులికాట్‌లో అప్పుడే పక్షుల కిలకిలలు







కాలం కాని కాలంలోనూ పులికాట్ సరస్సులో ఈ ఏడాది వలస పక్షుల సందడి కనిపిస్తోంది. సాధారణంగా వేసవిలో పులికాట్ ఎడిపోయి నెర్రెలుబారి ఉంటుంది. అయితే ఈ ఏడాది జనవరి దాకా కూడా వానలు కొనసాగడం, వేసవి ముగియకముందే అడపాదడపా వానలు పడడంతో సరస్సులో అక్కడక్కడా నీటి నిల్వలు చేరాయి. సముద్రపు ఆటుపోట్లకు కూడా సరస్సులోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో చేపా రొయ్యా కదలాడుతున్నాయి. తిండి దొరుకుతుండడంతో స్థానిక రకాల కొంగలతో పాటూ వలస పక్షులు కూడా సరస్సులో కనిపిస్తున్నాయి. ఫ్లెమింగోలు, పెయింటెడ్ స్టార్క్స్, పెలికాన్, నత్తగుల్ల కొంగలు, తెల్లకొంగలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఆ కాస్త నీటి చెలమల్లోనే వేటను వెతుక్కుంటున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అటూ ఇటూ.. అట్టకానితిప్ప వేనాడు దారి, కొరిడి-పేర్నాడు రోడ్డు, శ్రీహరికోట మొదటి గేటు సమీపంలో బకింగ్ కెనాల్ వద్ద పక్షులు సందడి చేస్తున్నాయి. మత్స్య సంపద దొరుకుతుండడంతో మరోవైపు జాలర్లు కూడా వలలు విసురుతున్నారు. పడవలు తిరుగుతున్నాయి. సాధారణంగా ఈ ప్రాంతానికి నైరుతి వానలు కురవవు. ఈశాన్య రుతుపవనాలతో జల్లులు మొదలై తుఫాన్‌లతో కురిసే వానలతో నదులు పొంగి పారుతాయి. చెరువులు నిండుతాయి. పులికాట్ కళకళలాడుతుంది. విచిత్రంగా ఈ వాతావరణం అప్పుడే పులికాట్‌లో కనిపించడం అరుదైన కనువిందు దృశ్యం.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి, ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్





దక్షిణామూర్తికి వెండి హారతి సెట్



వెండి హారతి సెట్‌ను అందజేస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ బొప్పన ఝాన్సీ తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురుపౌర్ణమిని పురస్కరించుకుని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బొప్పన ఝాన్సీ, డైరెక్టర్ సీమ రూ.4.10లక్షల విలువైన వెండి హారతి సెట్‌ను వితరణ చేశారు. వాటిని ఆలయ ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు చేశారు. వారు గురుదక్షిణామూర్తి వద్ద జరుగుతున్న పూజల్లో పాల్గొన్నారు.

మాన్యుఫ్యాక్చరింగ్ వరల్డ్‌లో శ్రీసిటీ ప్రాతినిధ్యం



సందర్శకులకు శ్రీసిటీ గురించి వివరిస్తున్న ప్రతినిధులు

శ్రీసిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తయారీ రంగానికి ప్రాధాన్యం కలిగిన ప్రపంచ గమ్య స్థానంగా శ్రీసిటీ గురించి వివరాణ్మతకంగా తయారు చేసిన మార్కెటింగ్ వీడియోలను శ్రీసిటీ మార్కెటింగ్ బృందం టోక్యోలో జరిగిన కార్యక్రమంలో ప్రదర్శించింది. జపాన్‌లోని టోక్యో నగరంలో జరిగిన 'మాన్యుఫ్యాక్చరింగ్ వరల్డ్ 2025' వాణిజ్య ప్రదర్శనలో శ్రీసిటీ పాల్గొని ప్రత్యేకతను చాటుకుంది. ఆర్ఎక్స్ జపాన్ లిమిటెడ్ నిర్వహించిన 37వ ఎడిషన్ ఎగ్జిబిషన్‌లో ఐటీ సొల్యూషన్స్, మెకానికల్ కాంపోనెంట్స్, మెడికల్ డివైసెస్, సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ మెయింటెన్స్ తదితర పది విభాగాలకు సంబంధించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. భారతదేశంలో రెండవ అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా వివరిస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షించింది. శ్రీసిటీ వ్యూహాత్మక స్థానం, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా అనుసంధానం, పరిశ్రమలు స్థాపించడం కలిగే వివిధ ప్రయోజనాలను శ్రీసిటీ మార్కెటింగ్ ప్రతినిధులు గోపికృష్ణ, కె.బాలాజీ, శ్రీసిటీ సలహాదారు మసనోరి నకానో సందర్శకులకు వివరించారు.

నైపుణ్య శిక్షణతో జీవనోపాధి కల్పన

- కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ భరత్‌కుమార్‌గుప్తా



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా జీవనోపాధి కల్పించే లక్ష్యం ఉందని రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ శాఖ డైరెక్టర్ భరత్‌కుమార్‌గుప్తా పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలకు అందిస్తున్న నిధులను సరైన రీతిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. మహిళలకు మంచి నైపుణ్య శిక్షణ అందివ్వడం ద్వారా ఉన్నత ఉపాధి కల్పన, తద్వారా మహిళా సాధికారతను సాధించడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుందన్నారు. ఈ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం లభిస్తున్న ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులకు అవగాహన కల్పించేలా యూనివర్సిటీలు ప్రయత్నించాలన్నారు. పద్మావతి యూనివర్సిటీ వీసీ ఉమ మాట్లాడుతూ.. పీఎం-ఉష పథకం ద్వారా యూనివర్సిటీకి మంజూరైన రూ. 100 కోట్లను పటిష్ఠ ప్రగతికి వినియోగిస్తున్నట్టు చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, కేరళకు చెందిన ఐఏఎస్ అధికారి డాక్టర్ ఉష తదితరులు విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన అంశాల్లో తమ అనుభవాలను పంచుకున్నారు.



తిరుపతిలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

గళం విప్పిన కలం

- దాడులను ఖండిస్తూ రోడెక్కిన జర్నలిస్టులు
- క్రికెట్ కిట్టు ధరించి నిరసన
- మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు

తిరుపతి(వైద్యం), జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టుల స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి' అంటూ జర్నలిస్టు సంఘాల నేతలు, జర్నలిస్టులు డిమాండు చేశారు. బంగారుపాళ్యంలో బుధవారం ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటాన్ని ఖండించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్ నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. వీరికి ప్రజా సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు మద్దతుగా నిలిచారు. 'జర్నలిస్టులపై దాడులకు పాల్పడటమే లక్ష్యంగా వైసీపీ మూకలు తెగబడుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై ఇదే రీతిలో దాడికి పాల్పడ్డారు. అదే తరహాలో ఇప్పుడు ప్రతిపక్షంలోనూ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై మూకుమ్మడిగా దాడికి దిగారు. ఇది సమాజానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ రౌడీ మూకలను శిక్షించి జర్నలిస్టులకు న్యాయం చేయాలి. శివకుమార్‌పై పది మందికిపైగా దాడికి పాల్పడుతున్న వీడియోలు, ఫొటోలు స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు కేసు నమోదు చేయడం, ప్రధాన నిందితులను వదిలేసి ఒకరిద్దరిపై కేసులు నమోదు చేస్తుండటం చూస్తుంటే పోలీసు వ్యవస్థపైనా నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దాడులకు పాల్పడిన వైసీపీ మూకలపై చర్యలు చేపట్టకుంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం' అని హెచ్చరించారు. వైసీపీ మూకల దాడులకు భయపడి జర్నలిస్టులు రక్షణ కవచాలు వేసుకొని విధులకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయంటూ క్రికెట్ రక్షణ కిట్ ధరించి నిరసన తెలిపారు. అనంతరం ధర్నా చేస్తున్న జర్నలిస్టులకు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవల్లి నరేంద్ర, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, జర్నలిస్టు నేతలు సురేంద్రరెడ్డి, కోలా లక్ష్మీపతి, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, పలు జర్నలిస్టు సంఘాల నేతలు, ప్రజా సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ బాధ్యత వహించాలి

జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం అమానుషమైన ఘటన. ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ నేతలను, బాధ్యులను శిక్షించాలి. దీనికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలి. మళ్లీ వైసీపీ నేతలు ఇలాంటి ఘటనలకు గట్టి చర్యలు చేపట్టాలి.

- చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి

జర్నలిస్టులపై దాడులు కొనసాగుతుండటం దౌర్భాగ్యం

జర్నలిస్టులపై దాడులకు పాల్పడే పరిస్థితులు కొనసాగుతుండటం నిజంగా దౌర్భాగ్యం. దీనిని అరికట్టాలంటే జర్నలిస్టులు ఐకమత్యంగా ఉండాలి. అధికారంలో ఉన్నా, లేకున్నా జర్నలిస్టులపై వైసీపీ నేతలు దాడులకు పాల్పడుతుండటం మానుకోవడం లేదు. జర్నలిస్టుల రక్షణకున్న చట్టాలను పక్కాగా అమలు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి.

- ఆర్ఎం ఉమామహేశ్వరరావు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్

జర్నలిస్టులపై దాడులు సమాజానికి మంచిది కాదు

జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదు. వైసీపీ నేతలు రౌడీల్లా వ్యవహరిస్తూ జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నాం. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి.

- జయచంద్ర, డీవైఎఫ్ఐ నేత

దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి

ఫొటో జర్నలిస్టు శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ రౌడీ మూకలను కఠినంగా శిక్షించాలి. ఈ దాడులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన వారిపైనా చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టుల స్వేచ్ఛను హరించేలా దాడులకు పాల్పడటాన్ని ఖండిస్తున్నాం.

- నరేంద్ర, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి

24 గంటల్లోపు చర్యలు తీసుకోవాలి

ఫొటో జర్నలిస్టుపై వైసీపీ నేతల మూకుమ్మడి దాడి దారుణం. దాడులకు పాల్పడిన వారితోపాటు.. ప్రేరేపించిన వారిపైనా 24 గంటల్లోపు చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టుల రక్షణ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి.

- మురళి, తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు

మాజీ డిప్యూటీ సీఎంపైనా చర్యలు తీసుకోవాలి

శివకుమార్‌పై దాడికి పాల్పడిన వారితోపాటు.. దాడికి ప్రేరేపించిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మీద కూడా చర్యలు తీసుకోవాలి. వైసీపీ నేతలు వారి చేతగానితనాన్ని నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక ఫొటో జర్నలిస్టుపై చూపారు.

- గిరిబాబు, రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

వైసీపీ రౌడీలను అరెస్టు చేయండి: టీడీపీ



తిరుపతి, జూలై10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసిన వైసీపీ రౌడీలను వెంటనే అరెస్టు చేయాలని తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ డిమాండు చేశారు. ఈ దాడిని ఖండిస్తూ గురువారం తిరుపతి భవాని నగర్‌లోని టీడీపీ క్లస్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులపై దాడిచేయడం వైసీపీ అల్లరిమూకలకు అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. అధికారంలో లేకపోయినా వారి దౌర్జన్యాలకు అదుపేలేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం, కూటమి నాయకులు మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, సుబ్బుయాదవ్, వినోద్ రాయల్ జగన్నాథం, సుధాకర్ రెడ్డి, రవితేజ నాయుడు, రూపేష్, శరత్, దేవాచారి, చంద్ర రెడ్డి, సురేష్, శంకర్ యాదవ్,అబ్దుల్లా, ముని, రమేష్, గౌష్ భాషా, సమీర్,, ముని, చంద్ర ఆచారి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

'స్కిట్'కు పూర్వవైభవం: సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)లో ఈ ఏడాది తరగతులు ప్రారంభించనుండటంతో పూర్వవైభవం రానుందని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శ్రీకాళహస్తిలోని స్కిట్‌లోని తరగతి గదులు, ల్యాబ్‌లు, భవనం తదితరాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్కిట్ ఏర్పాటు చేయించి స్థానిక విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించారన్నారు. వైసీపీ పాలకులు దీనిని మూసేసి యువతకు ద్రోహం చేశారని



స్కిట్‌లో భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీ ప్రకారం తిరిగి ప్రారంభించడానికి ఏడాదిగా ప్రయత్నించానన్నారు. తన బాల్యమిత్రుడు, మంత్రి లోకేశ్ స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అనుసంధానం చేసి... ముక్కంటి ఆలయానికి పైసా ఖర్చు లేకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యేలా చేసిన కృషి మరువలేమన్నారు. ప్రభుత్వం నుంచి స్కిట్ అభివృద్ధికి త్వరలో రూ.120 కోట్లు మంజూరవుతాయన్నారు. మరోమూడు రోజుల్లోనే ఆరు బ్రాంచుల్లో 300మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరేలా కసరత్తు ప్రారంభమైందన్నారు. దీని కోసం ఆరు తరగతి గదులు, ల్యాబ్, ప్రిన్సిపాల్ చాంబర్, ఇతర గదులను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో స్పేస్ టెక్నాలజీ.. మెడికల్ కళాశాలలను నెలకొల్పేలా ప్రభుత్వంలోని పెద్దలతో చర్చిస్తున్నానని చెప్పారు.

జీఎన్ఎస్ఎస్ ఈఈ హరిబాబుపై సస్పెన్షన్ ఎత్తివేత

- శ్రీకాళహస్తి డిప్యూటీ ఎస్ఈగా నియామకం

తిరుపతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గాలేరు-నగరి డివిజన్ ఈఈ సీహెచ్ హరిబాబుపై సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఆయన్ను శ్రీకాళహస్తి జీఎన్ఎస్ఎస్ డిప్యూటీ ఎస్ఈగా నియమించింది. ఈయన తిరుపతి జీఎన్ఎస్ఎస్ డివిజన్‌కు ఎఫ్ఏసీ ఈఈగా పనిచేసిన సమయంలో హైదరాబాదుకు చెందిన ఓ కాంట్రాక్టు సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా రూ.1.36 కోట్లు బ్యాంకు గ్యారెంటీలను రిలీజ్ చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. దానిపై ప్రభుత్వం గతేడాది డిసెంబరు 23న సస్పెండ్ చేసింది. శాఖాపరమైన విచారణకు ఆదేశించిన నేపథ్యంలో, సస్పెండు చేసి ఆరు నెలలు దాటినందున తనకు పోస్టింగ్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ గతనెల 4న లేఖ రాశారు. ఈ క్రమంలో సస్పెన్షన్ ఎత్తివేస్తూ గతనెల 30న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. తాజాగా శ్రీకాళహస్తి డివిజన్‌కు డిప్యూటీ ఎస్ఈగా నియమించింది.

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీలు సుస్థిర అభివృద్ధి సాధించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతి, సూచిక వర్షన్, ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, ఏఎన్ఎంలకు, మండల స్థాని అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో జాలిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించే ప్రత్యేక అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతి సూచికలపై శిక్షణ

కోట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ విస్తరణాధికారి వేణు ఆధ్వర్యంలో 2025-26 యాక్షన్ ప్లాన్‌పై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు.

తడ: స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్ అధ్యక్షతన పంచాయతీ పురోగతి సూచికలపై ఒకరోజు శిక్షణ తరగతులు జరిగాయి. పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, పద్మ, శ్రీనివాసులు, వీఆర్వోలు చలపతి, బాబు, వనజ, లలిత, మత్స్యశాఖ ఏడీ మహిజ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో వినీల్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఐసీడీఎస్ అధికారులకు పంచాయతీల పురోగతి సూచిక 2.0పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ట్రైనర్లుగా డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు, అశోక్, మౌళా వ్యవహరించారు.

డంపింగ్ యార్డులో కలెక్టర్ పరిశీలన


డంపింగ్ యార్డులో చెత్త శుద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీవో కిరణ్మయి, మున్సిపల్ కమిషన్ చిన్నయ్య

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే కాళంగి నదిని అనుకొని ఉన్న డంపింగ్ యార్డులో బయో మైనింగ్ పద్ధతిలో చెత్త తొలగింపు పనులను కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. మున్సిపాలిటీలో రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త డంపింగ్ యార్డులో పేరుకుపోతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తలోని ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుగా శుద్ధిచేసి ఎరువుల తయారు చేసేందుకు ఏజెన్సీకు అప్పగించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్, ఆర్డీవో కిరణ్మయితో కలిసి డంపింగ్ యార్డులో చెత్త శుద్ధిచేసి ఎరువులు తయారు చేస్తున్న పనులను పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దారు గోపినాథరెడ్డి, ఆర్ఐ రాజగోపాల్ పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా గిరిజన గురుకులాలు

కోట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన గురుకులాలను అధునాతన వసతులతో ఆదర్శంగా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని గిరిజనాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధి కోటలోని బాలికల గిరిజన గురుకులాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులకు క్రీడాస్థలం అవసరమని, పక్కనే ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న క్రీడా మైదానాన్ని కేటాయించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అనంతరం చిట్టేడులోని గిరిజన గురుకుల కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రజనీకుమారి ఉన్నారు.

దారిద్ర్యాన్ని రూపుమాపుదాం


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 సర్వేను సమగ్రంగా నిర్వహించి దారిద్ర్యాన్ని సమూలంగా రూపుమాపుదామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ భవన్‌లో గురువారం సచివాలయ, మెప్మా సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను పీ-4 సర్వే ద్వారా గుర్తించి కారణాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుదమ్మ, సచివాలయ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

చిల్లకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిగింది. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

ఆదిశంకరలో పంచప్రాణ స్వస్థత

గూడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర యూనివర్సిటీలో గురువారం మహర్షి మహేశ్‌యోగి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పంచప్రాణ స్వస్థత కార్యక్రమం నిర్వహించారు. ప్రాచీన భారత హీలింగ్ అభ్యాసకుడు ఆచార్య రఘురామ్ మాట్లాడుతూ ధ్యానం, యోగ సాధన ద్వారా మనిషి శక్తివంతుడవుతాడన్నారు. అలాగే మానసిక ఉత్తేజం, ఏకాగ్రతను పెంపొందించు కోవచ్చన్నారు. విశ్వశక్తిని శరీరంలోకి తీసుకోవడానికి వేల శక్తినాడులు మనిషి శరీరంలో ఉంటాయని, వాటిని క్రమపద్ధతిలో ప్రేరేపించడం ద్వారా శక్తిని పొందవచ్చన్నారు. యోగులు ఈ విధానాన్ని అనుసరించి ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వంకి పెంచలయ్య, శేఖర్‌రెడ్డి, డాక్టర్ రాజయ్య, ధనుంజయ, రామయ్య పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

వెంకటగిరి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఆ సంస్థ చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి అన్నారు. గురువారం స్థానిక పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లోక్‌అదాలత్ నిర్వహించారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల నుంచి 12 అర్జీలు అందగా, వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయుడుపేట ఈఈ శ్రీనివాసులు, వెంకటగిరి డీఈఈ మునిరవిచంద్ర, ఏఈలు అశోక్‌రెడ్డి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్
జైలుకెళ్లడం ఖాయం: కురుగొండ్ల

వెంకటగిరి, జులై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై ఉన్నన్ని కేసులు దేశంలోనే ఏ రాజకీయ నాయకుడి పైనా లేవన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమారెడ్డి చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం సిగ్గుతో తలదించుకొనే విధంగా ఉన్నాయన్నారు. ఆయనతో పాటు పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, ఎంపీపీ తనూజారెడ్డి, టీడీపీ నాయకులు రాజేశ్వరరావు, చంద్రమౌళిరెడ్డి, సత్యనారాయణ, మురళి ఉన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: పాశిం

గూడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో వసతులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు, తమ పిల్లలు ఎలా చదువుతున్నారో అవగాహన పెంచు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు మెరుగైన వసతులతో బోధన అందించేందుకు విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారన్నారు. విద్యార్థులకు నాణ్యత కలిగిన విద్యాసామగ్రి, యూనిఫాం, బూట్లు అందించడంతోపాటు నాణ్యమైన పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని అందిస్తున్నారన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదిగేలా బాటలు వేస్తున్నారన్నారు. అనంతరం పలు పాఠశాలలో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ ఎంఈవో రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్ కోసం బడివైపు తల్లిదండ్రులు ఒక అడుగు పేరుతో ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలో వసతులు గురించి తల్లిదండ్రులు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రుల సలహాలు కూడా ఎంతో అవసరమన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేసిందని విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకొంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునన్నారు. అదే విధంగా బాలుర ఉన్నత పాఠశాల, మండలంలోని అన్ని పాఠశాలలో ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు శివప్రసాద్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలి

నాయుడుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యాభ్యాసంలో తల్లిదండ్రు భాగస్వామ్యం ఉండాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్నారు. నాయుడుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన తల్లిదండ్రులు - ఉపాధ్యాయులు సమావేశంలో ఆమె మాట్లాడారు. బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, అందుకోసం విద్యాశాఖ సంపూర్ణంగా కృషి చేస్తోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్య, పుస్తకాలు, భోజనం, యూనిఫాం తదితర విద్యాసామగ్రిని ఉచితంగా అందజేస్తుందన్నారు. అంతేకాకుండా క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, తహసీల్దారు రాజేంద్ర, హెచ్‌ఎం మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులతో భోజనం చేస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం తదితరులు

విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రులది కీలక బాధ్యత

డక్కిలి, జులై 10 (ఆంధ్రజ్యోతి) విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రులు కీలక బాధ్యత తీసుకోవాలని డక్కిలి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత పేర్కొన్నారు. గారువారం గురుకుల కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, ఎంఈవో జగదీష్ బాబు, ఏఎస్‌వో వెంకటయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు దండవోలు, వెంకటరమణారెడ్డి, సర్వేపల్లి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించినట్లు ఎంఈవో మించల శంకరయ్య తెలిపారు.

వాకాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. వాకాడు ఎస్ఏఎల్‌సీఈఎఫ్ పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకుడు సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి రూ.50వేలతో కుర్చీలు, ట్రంకుపెట్టెలు, విద్యాసామగ్రి అందజేశారు. పూడిరాయదొరువు పాఠశాలలో 60మంది విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, హాట్‌బాక్సులను యర్రబోతు రాజగోపాల్‌రెడ్డి అందజేశారు. నిడిగుర్తి పాఠశాలలో తీపలపూడి రమణయ్య రూ.5వేలతో విద్యా సామగ్రి అందజేశారు. బుసపాళెంలోని పాఠశాలలో ఇంగిలీల బుజగేంద్ర విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. తిరుమూరులో కుంచం దయాకర్, ముట్టెంబాకలో అనిల్‌కుమార్‌రెడ్డి, గంగన్నపాళెంలో అయోధ్య బాలచంద్రయ్యశెట్టి, దుగరాజపట్నంలో దోశకాయల కృష్ణమూర్తి, వాలమేడులో శ్రీహరియాదవ్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఓజిలి: మండలంలో మెగా పేరెంట్ - టీచర్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈమావేశంలో ఎంఈవో శైలజ, టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌ను సన్మానించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని గురుకులాలు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. కోటలోని పూలే బీసీ బాలుర గురుకులంలో ప్రిన్సిపాల్ నారాయణరావు ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లులకు పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు. అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

చిట్టమూరు: మండలంలోని చిట్టమూరు, మల్లాం, అరవపాళెం, మొలకలపూడి, యాకసిరి, గునపాడు, మెట్టు, ఈశ్వరవాక, ఆరూరు ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈవో కృష్ణయ్య, పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఎల్ఏసాగరంలో ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయురాలు మీనా కుమారి, సూళ్లూరుపేట ఏఎస్‌డబ్ల్యూవో లక్ష్మీరాజ్యం, టీడీపీ నాయకుడు పెసల కిషోర్‌బాబు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, రామమోహన్, జీవీ నాయుడు, గురవయ్య, బాలసుబ్రహ్మణ్యం, ఆనంద్, సుబ్రహ్మణ్యం, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

తడ: మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. అండగుండాల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునరావు పాల్గొన్నారు. చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను గ్రామస్తులు సత్కరించారు.

నిరంకుశ పాలన నుంచి అభివృద్ధి వైపు తొలి అడుగు: విజయశ్రీ

ఓజిలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలనను పాతిపెట్టి సుపరిపాలనతో అభివృద్ధివైపు తొలి అడుగు వేసిందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం కరబల్లవోలు, సగుటూరు గ్రామాల్లో గురువారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను, చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ ఇంటింటా కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు పద్మావతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవివర్మ, ఏపీఎం పద్మ, ఓజిలి, పెళ్లకూరు టీడీపీ కన్వీనర్లు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, సంచి కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, నాయకులు బచ్చల రవీంద్రారెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుబ్బారావు, భాస్కర్‌రెడ్డి, దారా అంకయ్య పాల్గొన్నారు.

బాలాయపల్లి డీటీగా సందీప్

బాలాయపల్లి, జూలై10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి డిప్యూటీ తహసీల్దారుగా సందీప్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ శిరీష దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు.

వాకాడు డీటీగా రఫీ సయ్యద్

వాకాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వాకాడు డిప్యూటీ తహసీల్దారుగా రఫీ సయ్యద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన బదిలీపై వాకాడుకు వచ్చారు. రఫీ సయ్యద్‌ను రెవెన్యూ సిబ్బంది సత్కరించారు.

ఓజిలి ఎస్‌గా శ్రీకాంత్

ఓజిలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల ఎస్ఐగా కె.శ్రీకాంత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన స్వప్న బదిలీపై శ్రీహరికోటకు వెళ్లగా అక్కడ ఉన్న శ్రీకాంత్ ఓజిలికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

గూడూరు అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, వెంకటరమణయ్య, శివకుమార్, బీవీ రమణయ్య, మణి, శంకరయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు

గూడూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సాయిబాబా గుడి, నరసింగరావుపేటలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సాయి బాబాకు ప్రత్యేక పూజలు జరిపారు.

తడ: స్థానిక బోడిలింగాలపాడు వద్ద ఉన్న సాయిబాబా మంది రంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సాయిబాబాకు పాలతో అభిషేకం చేశారు. అనంతరం కలశపూజ జరిగింది. ఉభయదాతలుగా నిప్పో పరిశ్రమ ఎండీ ద్వారకనాథ్‌రెడ్డి వ్యవహరించగా, అన్నదాన కార్యక్రమాలను నిప్పో పరిశ్రమ హెడ్ నాగరాజు, రమేష్, శివారెడ్డి, ఏడుమలై తదితరులు పర్యవేక్షించారు. చినమాంబట్టులో ఉన్న కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో గోపూజ జరిగింది. నాగేశ్వరరావు, బాలసరస్వతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న సాయిబాబ, కుమ్మరిగుంట వద్ద సాయిబాబా ఆశ్రమం, కలివేలమ్మ ఆలయం వద్ద ఆలయాల్లో అన్నదానం చేశారు.

చిట్టమూరు: మండలంలోని చిట్టమూరు, మల్లాం, గునపాటిపాళెం సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్, కోట, తిమ్మానాయుడుపాళెం గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురువారం గురుపూర్ణిమ వేడుకలు జరిగాయి. బాబా ప్రతిమలతో గ్రామోత్సవం నిర్వహించారు. కోటలోని ఆలయంలోని బాబా విగ్రహానికి ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు కోటి కుమారుడు రోషన్ దాతృత్వంతో రూ.2 లక్షల విలువ చేసే వెండికి బంగారు తాపడం చేసిన సింహాసనాన్ని అందజేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని అగ్రహారపేట, బ్రాహ్మణ వీధుల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురువారం గురుపూర్ణిమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి పాలాభిషేకాలు చేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని కేఆర్‌పాలెం, సాయినగర్ ఉన్న సాయిబాబ ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. బాబాకు అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

వాకాడు: మండలంలోని గంగన్నపాళెం, వాకాడు గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం విశేష పూజా కార్యక్రమాలు ఆలయ పండితులు దివి అనంతాచార్యులు చేపట్టారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యావాచకం, మండపారాధన, విశేష హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

సహకారం.. సమన్వయంతోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా

పెళ్లకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులందరి సహకారం.. సమన్వయంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరు ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీడీవో ప్రమీలారాణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. సర్పంచులు, ఎంపీటీసీలు తెలియజేసిన సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని కోరారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు, కొత్తూరు పంచాయతీ సర్పంచు సంచి కృష్ణయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు పచాయతీ సర్పంచు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా రెవెన్యూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతన్నారన్నారు. అధికారులు భూ సమస్యలను త్వరితిగతిన పరిష్కరించాలని కోరారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, అర్అండ్‌బీ, విద్య, ఉపాధి, విద్యుత్, ఐసీడీఎస్, ఉద్యాన తదితర శాఖల అధికారుల గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరికృష్ణ, చెంబేడు, పెళ్లకూరు వైద్యాధికారులు చంద్రమోహన్‌రెడ్డి, జితేంద్ర, ఈవోపీఆర్డీ విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం


కలశ జలాలను తీసుకెళ్తున్న కొండేపాటి దంపతులు, ఎమ్మెల్యే విజయశ్రీ, నానాజీ, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాస గురుపౌర్ణమి సందర్భంగా గురువారం చెంగాళమ్మ ఆలయంలో మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ యాగం చేశారు. అనంతరం అమ్మవారికి 108 కలశ జలాలతో ఉభయకర్తలు కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతుల చేతుల మీదుగా అభిషేకం చేశారు. కొండేపాటి దంపతులకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పెంచలకోన ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, కొక్కు శంకరయ్య, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, బొమ్మన్ పళణి, సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

టిక్కెట్ కౌంటర్ ప్రారంభం

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నూతన టిక్కెట్ కౌంటర్‌ను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ టికెట్ కౌంటర్‌ను గురువారం టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, ఎమ్మెల్యే విజయశ్రీ ప్రారంభించారు. భక్తులు టిక్కెట్ కౌంటర్ సద్వినియోగం చేసుకోవాలని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిత


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి

చిల్లకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. గురువారం మండలంలోని చిల్లకూరు, పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం ఆయా పాఠశాలలో మొక్కలు నాటారు. చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మన్నెం శీనయ్య, డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో రవూఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొయ్యలగుంటల పరిశీలన

కోట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరం నుంచి తూర్పు కనుపూరుకు వెళ్లే మార్గంలో ఉన్న రొయ్యల గుంటలను గురువారం తహసీల్దారుతో పాటు పలు శాఖల అధికారులు పరిశీలించారు. రొయ్యల గుంటల నుంచి వచ్చే కలుషిత నీరు వరి పొలాల్లోకి ప్రవహించి భూములు ఉప్పుగా మారిపోతున్నాయని దువ్వూరు రాజగోపాలరెడ్డి అనే రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు జయజయరావు, వ్యవసాయ, మత్స్యశాఖ, ఇరిగేషన్ అధికారులు సుచేంద్ర ప్రసాద్, రెడ్యానాయక్, మునిరత్నం తదితరులు రొయ్యల గుంటలను పరిశీలించారు. ఇక్కడ వాస్తవ పరిస్థితులను నివేదిక రూపంలో కలెక్టర్‌కు పంపుతామని తహసీల్దారు జయజయరావు చెప్పారు.

బీఎల్‌వోలకు అవగాహన

వాకాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం తహసీల్దారు రామయ్య ఎన్నికల్లో బీఎల్‌వోల పాత్రపై అవగాహన కల్పించారు. బీఎల్‌వోలు అందరూ ఫామ్ 6, 7, 8లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.